సాక్షి ప్రకాశం

శనివారం । 4 । మార్చి । 2023



ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఇళ్ల నిర్మాణంలో ఆర్థిక ఇబ్బందులుంటే డ్వాక్రా సంఘాలకు ఇచ్చే సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. - IIలో..



విద్యార్థుల ఆరోగ్యంపై మంత్రి ఆరా

పెద్దదోర్నాల ఏకలవ్య గురుకుల పాఠశాలలో అస్వస్థతకు గురైన విద్యార్థుల ఆరోగ్యంపై మంత్రి సురేష్ అడిగి తెలుసుకున్నారు. - IIలో..

గరిష్టం/కనిష్టం
34 /19

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. రాత్రి చల్లని గాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ శాతం అధికం.

న్యూస్‌రీల్

రేపు ఫెన్సింగ్ జిల్లా జట్ల ఎంపిక

ఒంగోలు: ఫెన్సింగ్ ప్రకాశం జిల్లా జట్ల ఎంపిక ఈనెల 5న స్థానిక రాజీవ్‌నగర్‌లోని నారాయణ పబ్లిక్ స్కూలు ఆవరణలో నిర్వహిస్తున్నట్లు ప్రకాశం జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి జి.నవీన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఫెన్సింగ్ సీనియర్ క్యాటగిరీలో బాలబాలికలకు ఉమ్మడి ప్రకాశం జిల్లా జట్టు ఎంపిక నిర్వహిస్తున్నామన్నారు. పోటీల్లో పాల్గొనే ప్రతి క్రీడాకారుడు ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్లో వివరాలు రిజిస్ట్రేషన్ చేయించుకుని, రిజిస్ట్రేషన్ నంబర్‌తోపాటు ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, వ్యక్తిగత ఫెన్సింగ్ కిట్‌తో హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్లు 80195 67778 , 7671991147 ను సంప్రదించాలన్నారు.

తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు సిద్ధం

- ఫిర్యాదుల కేంద్రాల ఏర్పాటు

ఒంగోలు అర్బన్: గ్రామీణ నీటి సరఫరా విభాగం ద్వారా తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆ విభాగం ఎస్‌ఈ మర్దన్ అలీ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ మేరకు జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో రానున్న వేసవిలో ఎక్కడైనా తాగునీటి ఎద్దడి, సరఫరాలో సమస్యలుంటే పరిష్కరించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఆ మేరకు ఫిర్యాదుల సెల్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. జిల్లాలో అన్నీ గ్రామాలకు సంబంధించి ఫిర్యాదులు తెలిపేందుకు సర్కిల్ ఆఫీస్‌లో 08592-233275, మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు, కనిగిరి నియోజకవర్గంలోని ప్రజల కోసం పొదిలి డివిజన్ ఆఫీస్‌లో 08499-242252 నంబర్లను సంప్రదించాలని తెలిపారు. తాగునీటి సమస్యల తెలిపేందుకు ఈ ఫోన్‌లు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటాయన్నారు. సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ విజేతలకు జంకె అభినందన



క్రీడాకారిణిలను అభినందిస్తున్న జంకె వెంకటరెడ్డి

మార్కాపురం: గత నెల 27, 28, ఈ నెల 1వ తేదీ చిత్తూరు జిల్లా నగరిలో జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు బాలికల విభాగంలో రాష్ట్రంలో ద్వితీయ స్థానం సాధించిన మార్కాపురం మండలం గజ్జలకొండ విద్యార్థినిలను జిల్లా వైఎస్‌ఆర్ సీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి అభినందించారు. జాతీయ స్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షించారు. ఫిజికల్ డైరెక్టర్ రవీంద్రను, పాఠశాల సిబ్బందిని జంకె అభినందించారు. జాతీయ స్థాయి పోటీలకు గజ్జలకొండ, భూపతిపల్లి, కరేడు, పోతలపాడు విద్యార్థులు ఎంపికై నట్లు రవీంద్రబాబు తెలిపారు. విద్యార్థినిలను పాఠశాల హెచ్‌ఎంతో పాటు గ్రామానికి చెందిన జై ఆంధ్ర సుబ్బారెడ్డి, వైఎస్‌ఆర్ సీపీ మైనార్టీ నాయకులు గౌస్ మొహిద్దీన్ అభినందించారు.

పది పరీక్షలకు అధికారులు సన్నద్ధం

- జిల్లావ్యాప్తంగా 175 కేంద్రాలు
- హాజరుకానున్న 29,252 మంది విద్యార్థులు

ఒంగోలు: పదో తరగతి పరీక్షలకు అధికారులు సన్నద్ధమయ్యారు. గతేడాది ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పరీక్షలు నిర్వహించగా, తాజాగా విభజన అనంతరం ఏర్పడిన జిల్లాలో మాత్రమే పరీక్షలు నిర్వహిస్తున్నారు. మొత్తం 38 మండలాల్లో జరిగే పరీక్షలకు 175 పరీక్ష కేంద్రాలను ఎంపిక చేశారు. వాటిలో 28,902 మంది రెగ్యులర్ విద్యార్థులు, 350 మంది ఒకసారి ఫెయిలైన విద్యార్థులు కలిపి మొత్తం 29,252 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.

ప్రశ్నపత్రాలు భద్రపరిచేందుకు పరీక్ష కేంద్రాలను ఏ, బీ, సీ సెంటర్లుగా విభజించారు. ట్రెజరీ, పోలీసుస్టేషన్ ఉన్న కేంద్రాలను ఏ సెంటర్లుగా, వాటిలో ఏదో ఒకటి మాత్రమే ఉన్న వాటిని బీ సెంటర్లుగా, రెండూ లేని కేంద్రాలను సీ సెంటర్లుగా పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి 63 జోన్లుగా విభజించడంతో పాటు 10 రూట్లను ఎంపిక చేశారు. పదో తరగతి పరీక్షలను ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనుండగా, జవాబు పత్రాల మూల్యాంకనం ఏప్రిల్ 19 నుంచి 26వ తేదీ వరకు జరగనుంది.

రవాణా శాఖ కొత్తగా

జిల్లాలో రవాణా శాఖ రూపురేఖలు మారనున్నాయి. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో ఉమ్మడి ప్రకాశం పరిధిలోని చీరాల, కందుకూరు ఎంవీఐ కార్యాలయాలకు పక్క జిల్లాలకు వెళ్లిపోయాయి. దీంతో జిల్లా రవాణాశాఖ పరిధులు మారిపోయాయి. జిల్లా సరిహద్దులు సైతం మారాయి. కనిగిరి కేంద్రంగా కొత్తగా ఎంవీఐ కార్యాలయం ఏర్పాటు కానుంది. ఇందుకు సంబంధించి ప్రభుత్వం గత నెల 22వ తేదీన జీఓ జారీ చేసింది. అందుకు తగ్గట్టుగా అధికారులు చర్యలు చేపట్టారు.

- మారనున్న రూపు రేఖలు
- ఆరు మండలాలతో కనిగిరి కేంద్రంగా రవాణా శాఖ సేవలు
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- నెలాఖరులోపు కనిగిరిలో కార్యాలయం
- మారిన జిల్లా హద్దులు..



ఒంగోలులోని ఉపరవాణా కమిషనర్ కార్యాలయం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: పరిపాలనా వికేంద్రీకరణలో భాగంగా పాలనా ఫలాలు సత్వరం ప్రజలకు చేరేందుకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల పునర్విభజన ప్రక్రియ చేపట్టింది. ఈ ఉమ్మడి ప్రకాశం జిల్లాను కూడా ఆయా ప్రాంతాల భౌగోళిక స్వరూపం ఆధారంగా నూతన ప్రకాశం జిల్లాను ఏర్పాటు చేసింది. పాత జిల్లాలో 56 మండలాలు ఉండగా నేడు 38 మండలాలకు చేరాయి. ఈ క్రమంలో జిల్లాలో రవాణాశాఖలో సైతం మార్పులు రానున్నాయి. గతంలో విస్తారంగా ఉన్న 16వ నంబరు జాతీయ రహదారి కుంచించుకు పోయింది. గతంలో గుడ్లూరు మండలం చేవూరు చెక్ పోస్టు నుంచి మార్టూరు మండలం-చిలకలూరిపేట మండలం సరిహద్దులుగా ఉండేది. ప్రస్తుతం కందుకూరు అసెంబ్లీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోకి వెళ్లిపోయింది. దీంతో సింగరాయకొండ మండలంలోని మన్నేరు నెల్లూరు-ప్రకాశం జిల్లా సరిహద్దుగా ఏర్పడింది. ఇటు దక్షిణం వైపు మద్దిపాడు-కొరిశపాడు సరిహద్దుగా బాపట్ల జిల్లా ఏర్పాటైంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఉన్న చీరాల, కందుకూరు రవాణా శాఖ కార్యాలయాలు ఆయా జిల్లాల్లోకి వెళ్లిపోయాయి. ప్రస్తుతం జిల్లాకు నూతనంగా కనిగిరిలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. 2023 ఫిబ్రవరి 22న మెమోను ప్రభుత్వం జారీ చేసింది. 2022 ఏప్రిల్ 3వ తేదీన విడుదల చేసిన జీవో ఎంఎస్ నంబర్ 88, 2022 జూలై 12న విడుదల చేసిన జీఓ ఎంఎస్ నంబర్-21లో ఉన్న నిబంధనలను ఉటంకిస్తూ రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ పీఎస్ఆర్.ఆంజనేయులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు జిల్లాలో ఒంగోలు కేంద్రంగా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్(డీటీసీ) కార్యాలయంతో పాటు ఒంగోలు, మార్కాపురాల్లో రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ (ఆర్‌టీఓ) కార్యాలయాలు, దర్శిలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం ఉంది.

ఒంగోలు ఆర్టీవో కార్యాలయం పరిధిలో...

ఒంగోలు కేంద్రంగా జిల్లా రవాణా శాఖ కార్యాలయం డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ (డీటీసీ) కార్యాలయం ఉంది. అలాగే రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ (ఆర్టీవో) కార్యాలయం కూడా ఉంది. దీని పరిధిలో ఒంగోలు నగర పాలక సంస్థతో పాటు ఒంగోలు మండలం, మద్దిపాడు, సంతనూతలపాడు, చీమకుర్తి, నాగులుప్పలపాడు, కొత్తపట్నం, సింగరాయకొండ, టంగుటూరు, జరుగుమల్లి, కొండపి, పొన్నలూరు మండలాలు ఉన్నాయి.

మార్కాపురం ఆర్టీవో పరిధిలో...

మార్కాపురం ఆర్టీవో కార్యాలయం పరిధిలో 14 మండలాలు ఉన్నాయి. మార్కాపురం మున్సిపాలిటీ, గిద్దలూరు మున్సిపాలిటీలతో పాటు మార్కాపురం మండలం, గిద్దలూరు మండలంతో పాటు బేస్తవారిపేట, రాచర్ల, కొమరోలు, కంభం, అర్ధవీడు, యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, దోర్నాల, పెద్దారవీడు, తర్లుపాడు, కొనకనమిట్ల మండలాలు ఉన్నాయి.

దర్శి ఎంవీఐ కార్యాలయం పరిధిలో...

దర్శి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ-యూనిట్ ఆఫీస్) కార్యాలయం పరిధిలో దర్శి, దొనకొండ, కురిచేడు, ముండ్లమూరు, తాళ్లూరు, పొదిలి, మర్రిపూడి మండలాలు ఉన్నాయి. నూతనంగా ఏర్పాటు చేయనున్న కనిగిరి ఎంవీఐ కార్యాలయం పరిధిలోకి వెళ్లిన ఆరు మండలాలకు ప్రస్తుతం దర్శి ఎంవీఐ కార్యాలయం పరిధిలోనే సేవలు అందిస్తున్నారు.

- కందుకూరు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని ఎత్తేసి కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గంలో ఉన్న ఐదు మండలాలను, కందుకూరు మున్సిపాలిటీలను నెల్లూరు జిల్లా కావలి ఆర్టీవో కార్యాలయం పరిధిలోని తీసుకెళ్లారు. కందుకూరు, లింగసముద్రం, వలేటివారిపాలెం, గుడ్లూరు, ఉలవపాడు మండలాలు కావలి ఆర్టీవో కార్యాలయం పరిధిలోకి వెళ్లాయి.
- చీరాల మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం బాపట్ల జిల్లాలోకి వెళ్లిపోయిన సంగతి తెలిసిందే. అందులో భాగంగానే గతంలో దర్శి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం పరిధిలో ఉన్న అద్దంకి అసెంబ్లీ నియోజకవర్గంలోని అన్ని మండలాలు కూడా చీరాల ఎంవీఐ కార్యాలయం పరిధిలోకి తెచ్చింది. ఇక సాధారంగా పర్చూరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని అన్ని మండలాలు కూడా చీరాల ఎంవీఐ కార్యాలయం పరిధిలోకి వెళ్లాయి.

కొత్తగా కనిగిరిలో ఎంవీఐ కార్యాలయం

కనిగిరి పట్టణ కేంద్రంగా చేసుకొని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) కార్యాలయాన్ని రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఆరు మండలాలను ఆ కార్యాలయ పరిధిలోకి తీసుకొచ్చింది. వాటిలో కనిగిరి పట్టణంతో పాటు కనిగిరి మండలం , పామూరు, సీఎస్ పురం, పీసీపల్లి, వెలిగండ్ల, హెచ్‌ఎంపాడు మండలాలను కార్యాలయ పరిధిగా నిర్ణయించారు. అందుకోసం జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్(డీటీసీ)కి ఉత్తర్వులు కూడా పంపించారు. 2023 మార్చి 21వ తేదీలోపు కార్యాలయ ఏర్పాటుకు సన్నాహాలు చేసుకోవాలని కూడా రవాణా శాఖ కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నూతన జిల్లాగా ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ ఆరు మండలాలు దర్శి రవాణా శాఖ యూనిట్ కార్యాలయం పరిధిలో ప్రజలు సేవలు పొందుతున్నారు.

కనిగిరి ఏఎంసీలో కార్యాలయం



నూతనంగా కనిగిరిలో ఎంవీఐ కార్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. పట్టణంలో కార్యాలయం ఏర్పాటు చేసేందుకు భవనాలను అన్వేషిస్తున్నాం. ప్రధానంగా కనిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) కార్యాలయ ప్రాంగణాన్ని పరిశీలించాం. ఈ నెలాఖరులోపు కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలన్న ఉత్తర్వులు వచ్చాయి. సిబ్బంది ఏర్పాటుతో పాటు ఇతర అంశాలకు సంబంధించి ప్రభుత్వం నుంచి విధివిధానాలు రావాల్సి ఉంది. దర్శి ఎంవీఐ కార్యాలయ పరిధి నుంచి ఆరు మండలాలను వేరు చేసి కనిగిరిలో కొత్త కార్యాలయం ఏర్పాటు చేయాలి.

– బి.కృష్ణవేణి, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్, ఒంగోలు

7న విశిష్ట మహిళామణులకు సన్మానం

ఒంగోలు టౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 7వ తేదీ వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న ఐదుగురు మహిళలను ఘనంగా సన్మానించనున్నట్టు మహిళాభ్యుదయ సమితి రాష్ట్ర అధ్యక్షురాలు తేళ్ల అరుణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాళం నరసమ్మ (రాజకీయ రంగం), సింహాద్రి జ్యోతిర్మయి (సాహితీ రంగం), చొటుపల్లి నీరజా చంద్రన్ (అభినేత్రి), వేదాల విజయలక్ష్మి (సేవారంగం), చేజర్ల శంతన (నాట్య కళాకారిణి)లను ఇందుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఒంగోలులోని మహిళాభ్యుదయ సమితి కార్యాలయం ఆవరణలో నిర్వహించే మహిళా దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథులుగా న్యాయసేవ విభాగం జిల్లా కార్యదర్శి కె.శ్యాంబాబు, స్త్రీ శిషు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ వై.ధనలక్ష్మి, నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షుడు నాగభైరవ ఆదినారాయణ, ప్రముఖ వైద్యురాలు చాపల శాంతకుమారి తదితరులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

జాతీయ స్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు నాగేంద్రకుమార్

పొదిలి: పట్టణానికి చెందిన క్రీడాకారుడు ఏ.నాగేంద్రకుమార్ జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పీఈటీ ప్రసాద్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం జరిగింది. గుంటూరులో జరిగే పోటీలకు వెళ్లిన నాగేంద్రకుమార్‌కు ప్రోత్సాహం కిందద, స్థానిక యువకులు కాలేషా, రబ్బాని, రాజేష్ రూ.5 వేల నగదు అందచేశారు. మంచి ప్రతభ కనపరిచి, మంచిపేరు తెచ్చుకోవాలని వారు ఆకాంక్షించారు.



ప్రోత్సాహక నగదు అందుకుంటున్న నాగేంద్ర కుమార్

వేగంగా చెన్నకేశవస్వామి ఆలయ గోపురాల పనులు



నూతనంగా నిర్మించనున్న ప్రాకార గోపురాల నమూనా



స్వామివారి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న పనులు

- సుమారు రూ.5.50 కోట్లతో అభివృద్ధి పనులు
- డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యం

మార్కాపురం: స్థానిక పురాతన లక్ష్మీ చెన్నకేశవ స్వామివారి ఆలయ అభివృద్ధి పనులు నెల రోజుల నుంచి వేగంగా జరుగుతున్నాయి. ఈ అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ప్రతి ఐదు రోజులకు ఒకసారి ఆలయానికి వెళ్లి పనుల పురోగతిని ఈఓ శ్రీనివాసరెడ్డి, చైర్మన్ కేశవరావులతో కలిసి సమీక్షిస్తున్నారు. తమిళనాడుకు చెందిన వర్కర్లు పనులు చేస్తున్నారు. గత ఏడాది ఆగస్టు 20న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి ఈ పనులకు శంకుస్థాపన చేశారు. గుడికి నాలుగు వైపులా నాలుగు ఆలయ ప్రాకార గోపురాలకు భూమిపూజ చేశారు. సుమారు రూ.5.50 కోట్లతో ఆలయంలో గోపురాల నిర్మాణంతో పాటు ఆలయంలో ఆండాళ్లమ్మ ఆలయం, డార్మిటరీ, వివిధ నిర్మాణాలు జరుగుతున్నాయి. తూర్పు, పడమర ఐదు అంతస్తుల్లో 68 అడుగుల ఎత్తులో 36.6 అడుగుల వెడల్పులో, ఉత్తర దక్షిణ దిశలలో మూడు అంతస్తులతో 38.6 అడుగుల ఎత్తులో 24.11 అడుగుల వెడల్పులో నాలుగు గోపురాలు నిర్మించనున్నట్లు ఈఓ శ్రీనివాసరెడ్డి, చైర్మన్ పెనుగొండ కేశవరావు తెలిపారు. ఈ గోపురాలకు దేవదాయశాఖ సీజీఎఫ్ కింద రెండు కోట్ల రూపాయలు ఇస్తుండగా మిగిలిన నగదును దాతలు ఏర్పాటు చేస్తున్నారు. నాలుగు గోపురాల పనులు శిల్పుల ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. ఇందుకు సంబంధించిన నమూనా వీడియోను ఆలయ సిబ్బంది విడుదల చేశారు. నిర్మాణాలు పూర్తయితే మార్కాపురం పట్టణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకోనుంది. ఇప్పటికే ఆలయంలో వెండి రథంతో స్వామివారు రథసప్తమి నాడు సప్త వాహనాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఇక ఏప్రిల్‌లో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతాయి.

డిసెంబర్ నాటికి పూర్తి




లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి నాలుగు రాజగోపురాల నిర్మాణ పనులు డిసెంబర్ నాటికి పూర్తి చేయాలనుకుంటున్నాం. పనులు వేగంగా జరుగుతున్నాయి. పనుల నాణ్యతలో ఎక్కడా రాజీపడటం లేదు.

– గొలమారి శ్రీనివాసరెడ్డి, ఈఓ

నిమ్మ అధరహో..

- కేజీ నిమ్మ రూ.75

కనిగిరి రూరల్: నిమ్మ ధర రోజు రోజుకూ అమాంతం పెరుగుతుండటంతో రైతుల మోముల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. జిల్లాలోనే అత్యధికంగా కనిగిరి నియోజకవర్గంలో, ప్రత్యేకించి హెచ్‌ఎంపాడు మండలంలో సుమారు 20 వేల ఎకరాల్లో నిమ్మ సాగు చేస్తారు. గత నెలలో కేజీ రూ.28 వరకు పలికిన పచ్చికాయ శుక్రవారం ఒక్కసారిగా కేజీ రూ.70 నుంచి రూ.75 వరకు పలికింది. పండుకాయ రూ.45 నుంచి రూ.50 వరకు పలుకుతుందని హోల్‌సేల్ వ్యాపారులు తెలిపారు. మంచి గిట్టుబాటు ధర లభిస్తున్నా.. దిగుబడి మాత్రం తగ్గినట్లు రైతులు తెలిపారు. గత నెలలో రోజూ నాలుగు లారీల నిమ్మ అమ్మకానికి వస్తుండగా.. ప్రస్తుతం రెండు మాత్రమే వస్తున్నట్లు హోల్ సేల్ వ్యాపారులు తెలిపారు. బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాలకు నేరుగా కొందరు రైతులు ఎగుమతి చేస్తున్నా, కోల్‌కత్తా, ఢిల్లీ, బాంబే, జైపూర్ ప్రాంతాలకు మాత్రం హోల్ పాయింట్ల నుంచే ఎగుమతి చేస్తున్నారు. ఈ నిమ్మ ధర ఏప్రిల్, మే నాటికి మరింత పెరిగే అవకాశం ఉంది.



పచ్చి నిమ్మకాయలు

కుక్కల దాడితో చుక్కల దుప్పి మృతి

పొదిలి: అరణ్యంలో నుంచి పొలాలు, పొలాల నుంచి జనావాసాల మధ్యకు వచ్చిన చుక్కల దుప్పి కుక్కల దాడిలో మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి జరిగింది. వివరాలు పొలాల్లో ఇటీవల కాలంలో పలు చోట్ల చుక్కల దుప్పిలు సంచరిస్తున్నాయి. ఈక్రమంలో దర్శి రోడ్డులోని ఎస్‌వీకేపీ డిగ్రీ కళాశాల సమీపంలో సంచరిస్తున్న దుప్పిపై కుక్కల గుంపు దాడి చేసింది. దీంతో దుప్పి మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న ఎస్సై మల్లికార్జునరావు సంఘటనా స్థలానికి చేరుకుని, మృతి చెందిన దుప్పిని పరిశీలించారు. అటవీ అధికారులకు సమాచారం ఇవ్వటంతో అక్కడి చేరుకుని దుప్పి కళేబరాన్ని పోస్టుమార్టం నిమిత్తం పశు వైద్యశాలకు తరలించగా పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ వేణు పోస్టుమార్టం నిర్వహించారు. కుక్కలదాడితోనే చనిపోయి ఉంటుందనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కళేబరాన్ని పొదిలి కొండ వద్ద దహనం చేసేందుకు తరలించినట్లు అధికారులు తెలిపారు. సెక్షన్ ఆఫీసర్ కె.మోహనరావు, ఎఫ్‌బీఓ బాలచెన్నయ్య, సిబ్బంది సుభాని పాల్గొన్నారు.



సంఘటన స్థలంలో ఎస్సై మల్లికార్జున

శభాష్ రామయ్య !

- ఒంటిచేత్తో 1200 పచ్చాకు కర్రలు అల్లిక

చోడవరం (కొండపి): మండలంలోని చోడవరంలో గ్రామానికి చెందిన నారాయణ పొగాకు బ్యారన్ వద్ద పచ్చాకు ముఠాలో పనికి వచ్చిన రామయ్య శుక్రవారం ఒక్కడే 1200 పచ్చాకు కర్రలు అల్లి శభాష్ అనిపించుకున్నాడు. గ్రామస్తులు తెలిపిన సమాచారం మేరకు.. ఒక బ్యారన్‌కి 1200 కర్రలు వరకు పచ్చాకుతో అల్లి పెడతారు. ఇందుకుగాను కూలీలు 8 గుర్రాలు వేసి అల్లుతారు. కాగా పల్నాడుకు చెందిన బిరుదు రామయ్య ఉదయం 7.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఒక్కడే ఒంటి గుర్రం వేసుకుని 8 మంది అల్లాల్సిన 1200 పచ్చాకు కర్రలు ఒక్కడే అల్లిక చేసి గ్రామస్తుల చేత శభాష్ రామయ్య అనిపించుకున్నాడు. ఈ సందర్భంగా రామయ్యకు గ్రామస్తులు శాలువకప్పి పూలదండవేసి ఘనంగా సన్మానించారు.



గుర్రం వేసి ఒక్కడే పచ్చాకు అల్లుతున్న రామయ్య

ఆపస్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

ఒంగోలు: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.మల్లిఖార్జునరావు, టి.దిలీప్ చక్రవర్తిలు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 5, 6 తేదీల్లో నెల్లూరు ఆర్టీసీ బస్టాండు సమీపంలోని వెంకటేశ్వర కస్తూర్బా కళాక్షేత్రంలో ఈ సమావేశాలు జరుగుతాయన్నారు. స్థానిక అంజయ్యరోడ్డులోని ఆంధ్రకేసరి విద్యాకేంద్రం నుంచి, కందుకూరులోని బాలుర ఉన్నత పాఠశాల వద్ద నుంచి రెండు బస్సులు 5వ తేదీ ఉదయం 6.45 గంటలకు బయల్దేరుతాయన్నారు.

పేస్‌లో ఘనంగా సృజన 2కే23 టెక్నికల్ ఫెస్ట్



మాట్లాడుతున్న మద్దిశెట్టి శ్రీధర్

ఒంగోలు: స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీలో 2కే23 టెక్నికల్ ఫెస్ట్ వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమలో దాగి ఉన్న నైపుణ్యాలు, భావ వ్యక్తీకరణ , సృజనాత్మకతను వెలికితీసేందుకు దోహదపడతాయన్నారు. కాలేజీలో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను ఆయన సందర్శించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయంటూ స్టాల్స్ ఏర్పాటు చేసిన వారిని అభినందించారు. ఈ టెక్నికల్ ఫెస్ట్‌కు రాష్ట్రవ్యాప్తంగా అనేక కాలేజీల నుంచి 1200 మందికిపైగా విద్యార్థులు హాజరయ్యారు. పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజంటేషన్, టెక్నికల్ క్విజ్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో మొదలైన పోటీల్లో పాల్గొని వారు తమ ప్రతిభను ప్రదర్శించారు.

ప్రతిభ చూపించిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, ఏవో ఎం.రమణబాబు, డీన్ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్స్ కె.రూప అక్కేష్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

మాలకొండ హుండీ ఆదాయం రూ.1.48 కోట్లు



మాలకొండలో హుండీని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

వలేటివారిపాలెం: ప్రసిద్ధి పుణ్య క్షేత్రం మాలకొండలో 18 వారాల హుండీని శుక్రవారం లెక్కించినట్లు ఆలయ ఈఓ శ్రీనివాసరావు తెలిపారు. హుండీ లెక్కింపు ద్వారా రూ.1,04,84,868 వచ్చినట్లు చెప్పారు. హుండీ లెక్కింపులో భాగంగా విదేశీ కరెన్సీలు యూఎస్ డాలర్లు 72, యూరోస్ 175, యునైటెడ్ స్టేట్స్ 1000 డైమెండ్స్, సౌత్ ఆఫ్రికా 10 రియల్స్, ఒమెన్ 8 రియల్స్ వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. బంగారం 285 గ్రాములు, వెండి 1.940 కేజీలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమానికి పర్యవేక్షణ అధికారులుగా వై.బైరాగి, వీవీఎల్.రవీంద్రనాథ్ వ్యవహరించారు.

క్లుప్తంగా

వేగంగా ప్రభుత్వ భవనాల నిర్మాణం

● జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ప్రభుత్వ ప్రాధాన్యం ఉన్న భవనాల నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ పంచాయతీరాజ్ ఇంజినీర్లను ఆదేశించారు. శుక్రవారం సచివాలయాలు, ఆర్‌బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్, బీఎంసీయూ నిర్మాణాల పురోగతిపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు పూర్తి చేసిన పనులకు ప్రభుత్వం నుంచి బిల్లులు పొందిన కాంట్రాక్టర్లు, మిగిలిన పనులను వెంటనే చేపట్టేలా చూడాలన్నారు. పెండింగ్ బిల్లులు ఈ నెలాఖరుకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్ఎస్ఆర్ రేట్ల విషయంలో సందేహాలుంటే స్పష్టత కోసం పంచాయతీరాజ్ కమిషనర్‌కు లేఖ రాయాలని సూచించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నందున విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణంపై దృష్టి సారించాలన్నారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఎస్ఈ కొండయ్య, ఈఈలు, డీఈఈలు, ఏఈఈలు పాల్గొన్నారు.


శ్రీకృష్ణ ఆలయంలో చోరీ



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై, క్లూస్ టీమ్

దొనకొండ: మండలంలోని పెదన్నపాలెం చెరువు కట్ట వద్ద శ్రీకృష్ణ ఆలయంలో గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై ఎం.సైదుబాబు కథనం మేరకు.. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయం తాళాలు పగలగొట్టి బీరువాలో దాచి ఉంచిన వస్తువులు, వెండి కిరీటం, శఠగోపం, పడగలు, అమ్మవారి మంగళసూత్రం చోరీ చేశారు. ఆలయ ధర్మకర్త చెన్నుబోయిన సుబ్బారావు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలాన్ని ఎస్సై పరిశీలించారు. ఒంగోలు నుంచి క్లూస్ టీమ్‌ను రప్పించి వేలిముద్రలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పెద్దపులి దాడిలో ఎద్దు మృతి



ఎద్దు కళేబరాన్ని పరిశీలిస్తున్న ఫారెస్ట్ బీట్ అధికారి తానీషా

పెద్దదోర్నాల: పెద్దపులి దాడిలో ఎద్దు మృతి చెందిన సంఘటన పెద్దదోర్నాల మండలంలోని వై.చర్లోపల్లి బీట్ పరిధిలోని దేవుడుకొండ అంటుబావి సమీపంలో బుధవారం చోటుచేసుకోగా శుక్రవారం వెలుగు చూసింది. ఈ సంఘటనలో వై.చర్లోపల్లికి చెందిన పులిగుజ్జు దావీదుకు చెందిన ఎద్దు మృతి చెందింది. అటవీశాఖ అధికారుల కథనం మేరకు.. ఈ నెల ఒకటో తేదీన మండల పరిధిలోని వై.చర్లోపల్లి బీట్ పరిధిలోని అంటుబావి ప్రాంతానికి మేతకు వెళ్లిన ఎద్దు తిరిగి రాకపోవటంతో తప్పి పోయిందని భావించి వెతుకులాట ప్రారంభించారు. ఈ క్రమంలో పులి దాడిలో చనిపోయిన ఎద్దు కళేబరాన్ని శుక్రవారం గుర్తించారు. సంఘటనా స్థలాన్ని ఫారెస్టు బీట్ ఆఫీసర్ తానీషా శుక్రవారం పరిశీలించారు.

పోక్సో కేసు నమోదు

ఒంగోలు టౌన్: తొమ్మిదో తరగతి చదివే ఓ బాలికపై నెల్లూరుకు చెందిన యువకుడు లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ సంఘటనపై ఒంగోలు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం పోక్సో యాక్టుపై కేసు నమోదైంది. ఆ వివరాల ప్రకారం.. ఒంగోలుకు చెందిన ఓ వ్యక్తి జీవనోపాధి కోసం నెల్లూరు వెళ్లి జీవిస్తున్నాడు. అతనికి ఇద్దరు కుమార్తెలు కాగా, పెద్ద కుమార్తెకు వివాహం చేశాడు. రెండో కుమార్తె తొమ్మిదో తరగతి చదువుతుండగా, నెల్లూరుకు చెందిన షేక్ షాహిద్ అనే యువకుడు ప్రేమిస్తున్నానంటూ వెంటపడ్డాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా లోబరుచుకున్నాడు. పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ విషయం బాలిక ఇంట్లో తెలియడంతో వారి కుటుంబం తిరిగి ఒంగోలు వచ్చేసింది. అనంతరం ఒంగోలు కూడా వచ్చిన నిందితుడు.. గత నెల 16వ తేదీ బాలికను నమ్మించి తనవెంట తీసుకెళ్లాడు. బాలిక అదృశ్యంపై ఒంగోలు వన్‌టౌన్ పోలీసుస్టేషన్లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు కూడా చేశారు. ఈ నేపథ్యంలో ఇంటికి వచ్చిన బాలిక.. తనను షాహిద్ అనే యువకుడు నమ్మించి విజయవాడ, చెన్నై తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడినట్లు తెలిపింది. ఈ విషయాన్ని బాలిక తల్లిదండ్రులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో ఫిర్యాదు స్వీకరించి గతంలో నమోదైన అదృశ్యం కేసును పోక్సో యాక్టు కింద నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

- ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి
- గృహాల లబ్ధిదారులతో కలెక్టర్ దినేష్‌కుమార్
- జగనన్న కాలనీ, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన
- విద్యా ప్రమాణాలు, కోడిగుడ్లపై ప్రత్యేక శ్రద్ధ

చీమకుర్తి: ఇళ్ల నిర్మాణంలో ఆర్థిక ఇబ్బందులుంటే డ్వాక్రా గ్రూపుల ద్వారా అందించే ఆర్థిక సాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ సూచించారు. సంతనూతలపాడు మండలం వడ్డెరపాలెం సమీపంలోని జగనన్న కాలనీ లే అవుట్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లబ్ధిదారులను చైతన్యపరిచి ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. అనంతరం ఆ సమీపంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. విద్యార్థుల విద్యాప్రమాణాలను స్వయంగా పరిశీలించారు. బోర్డు మీద రాసిన పదాలను చదివించారు. స్వయంగా విద్యార్థుల నోట్ పుస్తకాలలో కలెక్టర్ పదాలు రాసి చదివించారు. విద్యార్థులలో విద్యాప్రమాణాలు తక్కువగా ఉండటంతో టీచర్లపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బడికి రానటువంటి విద్యార్థులు సక్రమంగా బడికి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వలస వెళ్లిన కుటుంబాలకు



ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల నోట్‌బుక్స్‌లో పదాలు రాసి చదివిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సంబంధించిన విద్యార్థులు వారు వెళ్లిన చోట పాఠశాలల్లో చేరేలా పర్యవేక్షించాలన్నారు. అదే ప్రాంగణంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని కలెక్టర్ పరిశీలించారు. బాలింతలు, గర్భిణుల ఆరోగ్య పరిస్థితులు, హిమోగ్లోబిన్ శాతం వంటి వివరాలడిగి తెలుసుకున్నారు. ఉండాల్సిన కోడిగుడ్ల కంటే ఎక్కువగా ఉండటంతో ఎందుకు తీసుకున్నారని ప్రశ్నించారు. అంగన్‌వాడీ టీచర్, సూపర్‌వైజర్లకు నోటీసులు ఇవ్వాలని సీడీపీవోకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు దుంపా రమణమ్మ, హౌసింగ్ పీడీ చెన్నయ్య, ఈఈ శ్రీనివాస ప్రసాద్, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో రాఘవేంద్ర, స్థానిక సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై మంత్రి ఆరా

- విశాఖ నుంచి కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి సురేష్
- మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం
- ఆస్పత్రిలో విద్యార్థులను పరామర్శించిన సబ్ కలెక్టర్



విద్యార్థినులను పరామర్శిస్తున్న సబ్ కలెక్టర్ సేథు మాధవన్

పెద్దదోర్నాల: స్థానిక ఏకలవ్య మోడల్ పాఠశాలలో కలుషిత నీరు తాగి అస్వస్థతకు గురైన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆరా తీశారు. విశాఖపట్నంలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో పాల్గొన్న మంత్రి సురేష్ శుక్రవారం అక్కడి నుంచి కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. అస్వస్థతకు కారణమైన పరిస్థితులపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్‌కు సూచించారు.

సబ్ కలెక్టర్ పరామర్శ

కలుషిత నీరు తాగి అస్వస్థతకు గురై స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న విద్యార్థులను సబ్ కలెక్టర్ సేథు మాధవన్ శుక్రవారం పరామర్శించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులతో మాట్లాడారు. అనంతరం ఏకలవ్య మోడల్ పాఠశాలలో వసతులు, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలలోని కొందరు సిబ్బంది పనితీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ పలు ఆరోపణలు చేశారు. అంతకు ముందు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రవీంద్రారెడ్డి వైద్యశాలకు వచ్చి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. కోలుకున్న కొందరు విద్యార్థినులను మోడల్ పాఠశాలకు తరలించారు. ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ భాస్కర్‌కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామ్యూల్ జోబ్, వైద్యాధికారులు ఉన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం



నూతనంగా నిర్మించిన ఆలయం



పూజల్లో కుందురు తిరుపతిరెడ్డి దంపతులు



ఆలయంలో ప్రతిష్ఠించిన లక్ష్మీ నరసింహస్వామి.

కనిగిరి రూరల్: కేటీఆర్ టెక్నో స్కూల్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సం శుక్రవారం అత్యంత వైభంగా జరిగింది. ఆలయ ధర్మకర్త కుందురు తిరుపతిరెడ్డి, శారద దంపతుల ఆధ్వర్యంలో సుమారు 25 మంది వేద పండితులతో హోమాలు, అభిషేకాలు, పూజా కార్యక్రమాలు జరిగాయి. లక్ష్మీ నరసింహ స్వామి, శ్రీ గణపతి, శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవార్ల విగ్రహాలను, ధ్వజ స్తంభ ప్రతిష్ఠా కార్యక్రమాలను అత్యంత నియమ నిష్టలతో నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కుందురు తిరుపతిరెడ్డి, అఖిలభారత వాసవీ సత్ర సముదాయ అధ్యక్షులు దేవకి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో జరిగాయి. రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతల చెరువు సత్యనారాయణరెడ్డి, మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కదిరి బాబురావు, ఉగ్ర నరసింహారెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, మాజీ ఎంపీపీ పోతు కొండారెడ్డి, గాయం బలరాంరెడ్డి వేర్వేరుగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి. అనంతరం జరిగిన అన్న ప్రసాద వితరణ జరిగింది.

ముస్లింలకు లోకేష్ కుచ్చు టోపీ

టంగుటూరు: నూర్ బాషా ముస్లింలకు బీసీ సర్టిఫికెట్లు ప్రభుత్వం ఇవ్వడం లేదని శుక్రువారం చంద్రగిరి నియోజకవర్గంలో పాదయాత్ర సందర్భంగా నారా లోకేష్ ఆరోపించడం హాస్యాస్పదంగా ఉందని నూర్ బాషా, దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఓతూరి రసూల్ సాహెబ్, యూత్ కన్వీనర్ షేక్ కాలీషావలి విమర్శించారు. ముస్లిం టోపీని లోకేష్ నెత్తిన పెట్టుకుని ముస్లింలకు కుచ్చుటోపీ పెట్టాలని చూస్తున్నాడని ఎద్దేవా చేశారు. జగనన్న ప్రభుత్వంలో దూదేకులను బీసీ–బి గా గుర్తించి ఇండియన్ ముస్లిం పేరుతో కుల ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్నారని పేర్కొన్నారు. వైఎస్సార్ చేయూత, అమ్మఒడి తదితర సంక్షేమ పథకాలు సైతం దూదేకుల ముస్లిం మహిళలకు అందుతున్నా, అవేవీ అమలు చేయడం లేదని లోకేష్ అసత్య ప్రచారం చేయడం తగదన్నారు. రాష్ట్రంలో ఎక్కడ బీసీ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదో చెప్పాలన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండానే నిర్ణీత గడువులోగా కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరవుతున్నాయని, ఆ విషయం కూడా తెలియకుండానే పాదయాత్ర చేస్తున్న లోకేష్‌ను మాలోకం అనడంలో తప్పులేదన్నారు.



నియామక పత్రం అందుకుంటున్న కాలీషావలి

యూత్ కన్వీనర్‌గా కాలీషావలి నియామకం

నూర్ బాషా, దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘ రాష్ట్ర యూత్ కన్వీనర్‌గా టంగుటూరు మండలం పొందూరు గ్రామానికి చెందిన షేక్ కాలీషావలి నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం విజయవాడలోని ఓ హోటల్లో నిర్వహించిన కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఓతూరి రసూల్ సాహెబ్ నుంచి నియామక పత్రం అందుకున్నారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ సయ్యద్ బాజీ, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగూర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల న్యాయమైన అంశాలను పరిష్కరించాలి

ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు



విలేకరులతో మాట్లాడుతున్న బొప్పరాజు

ఒంగోలు అర్బన్: ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన న్యాయమైన ఆర్థిక అంశాలను పరిష్కరించాలని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం రెవెన్యూ అసోసియేషన్ భవనంలో ప్రకాశం, బాపట్ల జిల్లాల నాయకులతో ఉద్యమ కార్యాచరణ అమలుపై సమావేశం నిర్వహించి అనంతరం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఉద్యమ కార్యాచరణ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాదని కేవలం ప్రభుత్వం బాధ్యతలు గుర్తు చేసేందుకని అన్నారు. అనంతరం ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులను కలిసి ఉద్యమ కార్యాచరణలో పాల్గొనాలని కోరారు. దీనిలో ఏపీ జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ ఆర్‌వీఎస్ కృష్ణమోహన్, ఇతర నాయకులు వెంకటేశ్వరరెడ్డి, శివకుమారిరెడ్డి, డానియేల్, వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, ఇజాక్, శిరీష్, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

20 పొగాకు బేళ్లు స్వాధీనం

● అక్రమంగా తరలిస్తుండగా విజిలెన్స్ అధికారుల దాడి



సీజ్ చేసిన పొగాకు బేళ్లను చూపుతున్న వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు

టంగుటూరు: అక్రమంగా తరలిస్తున్న పొగాకు బేళ్లను గురువారం అర్ధరాత్రి టుబాకో బోర్డు విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం టంగుటూరులో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు వివరాలు వెల్లడించారు. గురువారం అర్ధరాత్రి సింగరాయకొండ మండలం నందనవనం గ్రామంలో 20 మేలిమి రకం పొగాకు బేళ్లను కొనుగోలు చేసి అక్రమంగా గుంటూరుకు తరలిస్తుండగా, సమాచారం అందుకున్న విజిలెన్స్ అధికారులు సింగరాయకొండ–టంగుటూరు రహదారిలో అడ్డగించారు. ట్రక్ డ్రైవర్‌ను అనుమతి పత్రాలు చూపాలని అడగగా తన దగ్గర లేవని చెప్పాడు. దీంతో విజిలెన్స్ అధికారులు పొగాకు బేళ్లను వాహనంతో సహా టంగుటూరు వేలం కేంద్రంలో అప్పగించారు. 20 మేలిమి రకం పొగాకు బేళ్లు సుమారు 2,950 కేజీలున్నాయని, వాటి విలువ ప్రస్తుత మార్కెట్‌లో రూ.5 లక్షల వరకు ఉండవచ్చని వేలం నిర్వహణాధికారి చెప్పారు. ఈ అక్రమ వ్యవహారం ఎవరెవరి మధ్య నడిచిందనే విషయంపై విచారణ చేపట్టామన్నారు. పొగాకు బేళ్లను అక్రమంగా విక్రయించినా, కొనుగోలు చేసినా భారీగా జరిమానా విధించడంతో పాటు లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. అక్రమ కొనుగోళ్ల గురించి సమాచారం తెలిపిన వారి పేర్లు గోప్యంగా ఉంచి, తగిన పారితోషికం కూడా ఇస్తామని ఆయన ప్రకటించారు. దాడుల్లో టుబాకో బోర్డు విజిలెన్స్ అధికారులు హర్ష, రామకృష్ణ, జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్ నుంచి మహిళా ఖైదీ పరార్

ఒంగోలు టౌన్: ఓ చోరీ కేసులో శిక్ష అనుభవిస్తున్న మహిళా ఖైదీ తప్పించుకున్న సంఘటన శుక్రవారం ఒంగోలులో జరిగింది. ఆర్ఐ ఓ.రవికుమార్ వన్టౌన్ పోలీస్ స్టేషన్లో చేసిన ఫిర్యాదు ప్రకారం.. దోర్నాల మండలంలోని అసన్నాబాద్ గ్రామానికి చెందిన మాండ్లా వేంగమ్మ అనే ముద్దాయి విద్యుత్ వైర్లు దొంగిలించిన కేసులో రిమాండ్ ముద్దాయిగా జిల్లా కారాగారంలో ఉంది. విరేచనాలు అవుతున్నాయని చెప్పడంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో గురువారం ఆమెను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేర్చారు. ఏఆర్ కానిస్టేబుల్ టీ.తిరుపతి స్వామి, మహిళా కానిస్టేబుల్ ఎం.సులోచనలను ఆమె వద్ద నిఘా పెట్టారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం గం.6.20 సమయంలో ముద్దాయి బాత్ రూంకు వెళ్లింది. ఎంతసేపటికీ రాకపోయేసరికి వెళ్లి చూస్తే ఆమె కనిపించలేదు. బాత్ రూం నుంచి ముద్దాయి పరారైంది. రిమ్స్ ప్రాంగణం, మహిళా వార్డులన్నీ వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ముద్దాయి పరారైనట్లు వన్ టౌన్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. వన్ టౌన్ సీఐ టీ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కల దాడిలో 17 గొర్రె పిల్లలు మృతి

● రూ.1.70 లక్షల నష్టం



కుక్కల దాడిలో చనిపోయిన గొర్రెలు

జరుగుమల్లి (సింగరాయకొండ): కుక్కల దాడిలో 17 గొర్రెలు మృతిచెందిన సంఘటన శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో జరుగుమల్లి మండలం కె.బిట్రగుంట పొలాల్లోని నిమ్మకాయల మోహనరావు పశువుల దొడ్డిలో చోటుచేసుకుంది. బాధితుడు మోహనరావు కథనం ప్రకారం.. పెద్ద గొర్రెలను మేతకు తోలుకుని వెళ్లి 17 చిన్న గొర్రెలను బిట్రగుంట పొలాల్లోని తన పశువుల దొడ్డిలో మోహనరావు కట్టేశాడు. సాయంత్రం 5 గంటల సమయంలో అతని భార్య పశువుల దొడ్డి వద్దకు వెళ్లగా గొర్రెలు బాగానే ఉన్నాయి. మోహనరావు పెద్ద గొర్రెలను తోలుకుని రాత్రికి తిరిగిరాగా.. దొడ్డిలోని చిన్న గొర్రెలపై కుక్కలు దాడి చేసి అవన్నీ చనిపోయి ఉన్నాయి. 1.70 లక్షల రూపాయల విలువ గల గొర్రెలను నష్టపోయానని మోహనరావు ఆవేదన వ్యక్తం చేశాడు.

క్లుప్తంగా

రేపు దాచూరి మెడికల్ క్యాంప్

ఒంగోలు టౌన్: దాచూరి రామిరెడ్డి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించే రెగ్యులర్ మెడికల్ క్యాంపును ఈ నెల 5వ తేదీ డీఆర్ఆర్ఎం హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు క్యాంప్ కన్వీనర్ మాదాల వెంకటరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు 94903 00076 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మహిళలకు 50 శాతం రాయితీపై వైద్యం

ఒంగోలు అర్బన్: ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక కిమ్స్ ఆస్పత్రిలో నేటి నుంచి ఈ నెల 20వ తేదీ వరకు మహిళలకు ప్రత్యేక ప్యాకేజీ ద్వారా 50 శాతం రాయితీపై వైద్య సేవలు అందించనున్నట్లు ఆస్పత్రి సీఓఓ కె.అంకిరెడ్డి తెలిపారు. ఓపీ ఉచితమని చెప్పారు. సంబంధిత బ్రోచర్‌ను ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ శ్రీహరిరెడ్డి, గైనకాలజిస్ట్ కల్పన గింజుపల్లి, సుజని సుంకర ఆవిష్కరించారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఒంగోలు: ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడూరి వెంకట్రావు, సీహెచ్ ప్రభాకరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండు రోజులుగా ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని పలు పాఠశాలలను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్‌కే చిన్నప్పతో కలిసి సందర్శించామని, ఈ సందర్భంలో అనేక సమస్యలను తాము గుర్తించామని అన్నారు. ఒంగోలు, మద్దిరాలపాడు, తిమ్మసముద్రం, ఇంకొల్లు, ముప్పవరం, కొరిశపాడు, వేటపాలెం, జాండ్రపేట, చీరాల, పర్చూరు, ఇడుపులపాడు, పూసపాడు, గంగవరం ఎయిడెడ్ పాఠశాలల్లో సమస్యలను గుర్తించామన్నారు. విద్యార్థులకు సౌకర్యాల కొరత, తెలుగు, హిందీ పండిట్లు లేకపోవడం, తదితర సమస్యలు గుర్తించామన్నారు. సమస్యలన్నీ పరిష్కరించాలని కోరారు.

6న మాదిగ అమరవీరుల సంస్మరణ సభ

ఒంగోలు: మాదిగ అమరవీరుల సంస్మరణ సభను ఈ నెల 6వ తేదీ ఒంగోలులో నిర్వహించనున్నట్లు దళిత హక్కుల సాధన సమితి అధ్యక్షుడు ముప్పవరపు గోపి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించాలని డిమాండ్ చేస్తూ ఉద్యమం చేపట్టి 28 సంవత్సరాలు అవుతుందన్నారు. అనేకమంది ప్రాణత్యాగాలు చేశారని, అమరవీరుల త్యాగాలు వమ్ము కాకుండా వారిని స్మరించుకుందామని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించే కార్యక్రమానికి పెద్ద ఎత్తున మాదిగ పెద్దలు, విద్యార్థులు, ప్రజాసంఘాలు, అభ్యుదయ వాదులు, మేధావులు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

చీమకుర్తి: స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కాలేజీలో గురువారం రాత్రి పదో తరగతి, ఇంటర్ విద్యార్థినులకు ఫేర్‌వెల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు తోటి విద్యార్థినులను అలరించాయి. కాలేజీ ప్రిన్సిపాల్ డి జయ, అధ్యాపకులు విద్యార్థినులనుద్దేశించి మాట్లాడారు. రానున్న పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించి కాలేజీకి, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని సూచించారు.

విద్యార్థులకు అట్టల పంపిణీ

గిద్దలూరు రూరల్: మండలంలోని క్రిష్ణంశెట్టిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వాసవీక్లబ్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష అట్టలు పంపిణీ చేశారు. పదో తరగతి పరీక్షల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి మంచి బహుమతి అందిస్తామన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగేంద్రరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. క్లబ్ ప్రెసిడెంట్ ఆరవీటి చంద్రశేఖర్, యూత్ ప్రెసిడెంట్ సూరే నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై అవగాహన

దర్శి: స్థానిక గురుకుల పాఠశాలలో గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సచివాలయాల మహిళా పోలీస్‌లు సరస్వతి, మాధవి, అనిత లు విద్యార్థులకు దిశ చట్టం, బ్యాడ్ టచ్, హోమో సెక్స్, ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగుతూ స్నేహభావం కలిగి ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ రూత్ రమోలా, ఏఎన్ఎం జీవీ రమణ, ఆశా కార్యకర్త సుశీల పాల్గొన్నారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

● ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి



సమావేశం నిర్వహిస్తున్న ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి

నాగులుప్పలపాడు: వేసవి నేపథ్యంలో మండలంలోని గ్రామాల్లో ఎక్కడా నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున కేవలం పలు శాఖల అభివృద్ధిపై సమీక్షించారు. వ్యవసాయశాఖపై నిర్వహించిన సమీక్షలో మండలంలో ఇప్పటికే అందిన వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ లబ్ధిదారుల జాబితా అందించారు. ఇటీవల మాండూస్ తుఫాన్‌కు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లింపుపై సమీక్షించారు. కండ్లగుంట, మద్దిరాలపాడు గ్రామాల్లో విద్యుత్ లైన్ల సమస్యను ఆయా గ్రామాల సర్పంచ్‌లు పల్లెర్ల అంజిరెడ్డి, అనూరాధ ఎంపీపీ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ అంజమ్మ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉన్నందున కేవలం కొన్ని శాఖల అభివృద్ధిపైనే సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ఎటువంటి తీర్మానాలు చేయకుండా సభను ముగించారు. ఎంపీడీవో ఏవీ కుమారి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేయాలని సర్పంచ్‌లకు సూచించారు. అందుకు సంబంధించిన బిల్లులను వెంటనే జమచేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ యాదాల రత్నభారతి, మండల ప్రత్యేకాధికారి అంజలా, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉగాది నాటికి గృహ ప్రవేశాలు చేయాలి



తొట్లలో నీరు తొలగిస్తున్న అధికారులు

కొత్తపట్నం: జగనన్న కాలనీల్లో నిర్మించే ఇళ్లను ఉగాది నాటికి పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేయాలని మండల ప్రత్యేక అధికారి అర్చన ఆదేశించారు. కొత్తపట్నంలోని జగనన్న కాలనీని శుక్రవారం పరిశీలించారు. ఉగాది నాటికి 310 ఇళ్ల పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, బేస్మెంట్ నుంచి రూఫ్‌లెవల్‌కు, అక్కడి నుంచి శ్లాబ్ వరకు పూర్తి చేయాలని సూచించారు. సచివాలయాలవారీగా లక్ష్యం పెట్టుకుని దాని ప్రకారం పూర్తి చేయాలని చెప్పారు. హౌసింగ్ ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు గ్రౌండ్ లెవల్‌లో ప్రతి ఒక్క ఇంటి నిర్మాణాన్ని సందర్శించి ప్రతిరోజూ వివిధ స్టేజీలలో ఉన్న నిర్మాణాన్ని పూర్తి చేసే విధంగా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఫ్రై డే - డ్రై డే కార్యక్రమంలో భాగంగా ఇంటి పరిసరాల్లో ఉన్న తొట్లు, డ్రమ్ములు, పాత్రల్లో నీరు నిల్వ ఉంచకూడదని ప్రజలకు సూచించారు. అలా ఉంచడం వలన దోమలు ఉత్పత్తి అవుతాయని, డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు సంభవిస్తాయని వివరించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ ఏ బాలచెన్నయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ కార్యాలయంలో సమీక్ష...

ఒంగోలు టౌన్: ఉగాది నాటికి ప్రభుత్వం నిర్దేశించిన 141 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు ఆదేశించారు. నేషనల్ హౌసింగ్ డేను పురస్కరించుకుని శుక్రవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో మండల సచివాలయ సిబ్బంది, గృహనిర్మాణ శాఖ అధికారులతో మండలంలోని జగనన్న కాలనీల గురించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇళ్ల నిర్మాణ పనుల్లో పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు 44 ఇళ్లు పూర్తయ్యాయని, మిగిలిన ఇళ్ల నిర్మాణాలు కూడా వివిధ దశల్లో ఉన్నాయని వివరించారు. ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మిగతా ఇళ్ల నిర్మాణాలను కూడా త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలని సూచించారు. బాల్య వివాహాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఐసీడీఎస్ అధికారులు, పోలీసులకు ఇవ్వాలన్నారు. గ్రామాల్లో జరిగే సమావేశాల్లో బాల్యవివాహాల గురించి అవగాహన కల్పించాలని చెప్పారు. సమావేశంలో ఐసీడీఎస్ సీడీపీవో మల్లీశ్వరి, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, హౌసింగ్ డీఈ నారాయణరెడ్డి, ఏపీఎం గోపీనాథ్, ఏఈలు బాబు, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

ట్రస్టు కార్యాలయాన్ని ప్రారంభించిన శిద్దా



ట్రస్టు కార్యాలయంలో పూజలు చేస్తున్న శిద్దా

ఒంగోలు: స్థానిక గుప్తాస్ మిడ్ టౌన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శ్రీవాసవీ శివగంగ నిత్యాన్నదాన ట్రస్టు సెంట్రల్ కార్యాలయాన్ని వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు శుక్రవారం ప్రారంభించారు. ముందుగా శ్రీ వాసవీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శిద్దా మాట్లాడుతూ వివిధ పుణ్యక్షేత్రాలలో భక్తులకు నిత్యాన్నదాన పథకం, వసతి సేవలను ట్రస్టు అందిస్తుండటాన్ని కొనియాడారు. అనంతరం ట్రస్టు ప్రధాన కార్యదర్శి కనుమర్లపూడి హరిప్రసాదరావు, సభ్యులు, కార్యవర్గ సభ్యులు కలిసి శిద్దాను సత్కరించారు. అనంతరం శింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయ చైర్మన్ కోట శ్రీనివాసకుమార్ ట్రస్టు సభ్యులతో కలిసి శ్రీవాసవీ శివగంగ ట్రస్టు ఉగాది క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు కోట్ల సోమేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ చినిగేపల్లి సురేష్‌బాబు, కార్యవర్గసభ్యుడు పెనుగొండ వెంకట నరసింహారావు, జిల్లా ఆర్యవైశ్య సంఘ నాయకుడు జలదంకి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి

● జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి



ప్రకృతి వ్యవసాయంలో పంట కోత ప్రయోగం చేస్తున్న రవీంద్రరెడ్డి, అధికారులు

మడనూరు (కొత్తపట్నం): పూర్తిస్థాయిలో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగుచేసిన వేరుశనగ పంటలో రసాయన ఎరువులు వాడిన పంట కంటే ఎక్కువ దిగుబడి వచ్చిందని జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి అన్నారు. రైతు సాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం వేరుశనగ పంటపై పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పంట క్రాప్ కటింగ్ నిర్వహించారు. నూరు శాతం ప్రకృతి కషాయాలతో పండించిన రెహమాన్ బాషా, వివిధ రకాల కాంప్లెక్స్ ఎరువులు, పురుగు మందులతో పండించిన సుల్తాన్ బాషా వేరుశనగ పంటలను పరిశీలించారు. దిగుబడిలో తేడాను కూడా పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయంతో పండించిన రెహమాన్‌కు 15 క్వింటాలు, రసాయన ఎరువులతో పండించిన సుల్తాన్ బాషాకు 9 క్వింటాలు రావడాన్ని గమనించారు. ధర కూడ ప్రకృతి వ్యవసాయం సాగు పంటకు ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆళ్ల రవీంద్రరెడ్డి మాట్లాడుతూ మండలంలో ఉన్న ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం ద్వారానే పంటలు సాగు చేయాలని, పెట్టుబడి తక్కువగా ఉండటమే కాకుండా దిగుబడులు కూడా అధికంగా వస్తున్నాయని తెలిపారు. ప్రాక్టికల్‌గా తీసి చూశామని, పరీక్షలు కూడా చేశామని చెప్పారు. కార్యక్రమంలో జూనియర్ పీవీ జాన్సీరాణి, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, అనిల్, మాస్టర్ ట్రైనర్ నరసింహులు, రెడ్డప్ప, శిరీష, వెంకటేశ్వర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పది విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న డీఈఓ రమేష్

మార్కాపురం టౌన్: పదో తరగతి విద్యార్థులపై హెచ్ఎంలు, టీచర్లు ప్రత్యేక దృష్టి సారించాలని డీఈఓ పిల్లి రమేష్ సూచించారు. శుక్రవారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మార్కాపురం, యర్రగొండపాలెం, కనిగిరి నియోజకవర్గాల ప్రభుత్వ, ఎయిడెడ్, కేజీబీవీ, మోడల్ స్కూల్, రెసిడెన్షియల్ పాఠశాలల హెచ్ఎంలతో ఆయన సమావేశమయ్యారు. సమావేశానికి డిప్యూటీ డీఈఓ చంద్రమౌళి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఈఓ రమేష్ మాట్లాడుతూ త్వరలో జరగబోయే పదో తరగతి పరీక్షల్లో ఆరు పేపర్లు మాత్రమే ఉంటాయని, విద్యార్థులను పరీక్షలకు ప్రిపేర్ చేయాలని, ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తూ నిర్లక్ష్యం లేకుండా చూసుకోవాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సత్సంబంధాలతో ఉండి వారి బంగారు భవిష్యత్తుకు పనిచేయాలన్నారు. అత్యున్నత ఫలితాల సాధనకు కృషి చేయాలని డీఈఓ రమేష్ ఆదేశించారు. సమావేశంలో ఎంఈఓ రాందాస్ నాయక్, హెచ్ఎం చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

రసీదు తప్పనిసరిగా తీసుకోవాలి

దొనకొండ: ఎరువుల దుకాణంలో రైతులు కొనుగోలు చేసిన క్రిమి సంహారిక మందులకు సంబంధించిన రసీదులు తప్పనిసరిగా తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక చిన్ని కృష్ణ ట్రేడర్స్ దుకాణాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, స్టాక్, పే బిల్లులు తనిఖీ చేశారు. దుఖాణం నిర్వాహకునికి పలు సూచనలు చేశారు. రైతులకు తప్పకుండా రసీదు ఇవ్వాలని ఏఓ ఆదేశించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటరు స్లిప్పుల పంపిణీ

చీమకుర్తి: ఈ నెల 13వ తేదీ జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన వారికి బీఎల్వోల ద్వారా ఓటరు స్లిప్పులు పంపిణీ చేస్తున్నట్లు తహసీల్దార్ పీ మధుసూదన్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటరు స్లిప్పులు రాని వారు ఈ నెల 5వ తేదీ తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదిస్తే అందిస్తామని చెప్పారు.

మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై సంతృప్తి

కొత్తపట్నం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ సంతృప్తికరంగా ఉందని ఎండీఎం సహాయ సంచాలకులు వాణి సురేఖ అన్నారు. మండలంలోని కొత్తపట్నం, ఈతముక్కల, గమళ్లపాలెం పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. కొత్తపట్నంలోని బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెనూ రిజిష్టర్లు, వంటగది, రైస్, కోడిగుడ్ల స్టాక్ బ్యాలెన్స్‌ను పరిశీలించారు. ఆమె వెంట విద్యాశాఖ అధికారి బి.అజయ్‌బాబు, హెచ్ఎం పాలేటి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

చెస్ పోటీలకు ఆహ్వానం

చీమకుర్తి: ఏపీ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ చీమకుర్తిలోని శ్రీవిద్యానికేతన్ హైస్కూల్‌లో చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు ఆంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6–14 సంవత్సరాల మధ్య వయసు గల వారు పాల్గొనాలని కోరారు.

కారును ఢీకొన్న స్కూల్ బస్సు

ఒంగోలు టౌన్: నగరంలోని బెల్లం కోటయ్య అపార్ట్‌మెంట్ నుంచి వెళ్తున్న కారును సౌత్‌బైపాస్ నుంచి అతివేగంగా వచ్చిన చైతన్య స్కూల్ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. ఆ మేరకు కారు డ్రైవర్ కామని రామారావు స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ ప్రమాదంలో కారు వెనుక భాగం పూర్తిగా దెబ్బతింది. అతివేగంగా, నిర్లక్ష్యంగా బస్సు నడిపిన డ్రైవర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. ఆ మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు

ఒంగోలు టౌన్: వ్యక్తిగత పనుల నిమిత్తం ఒంగోలు వచ్చిన మద్దిపాడు మండలం అన్నంగి గ్రామానికి చెందిన పల్లెపాటి పున్నమ్మను డిపోలో ఆర్టీసీ బస్సు ఢీకొంది. శుక్రవారం ఒంగోలు ఆర్టీసీ బస్ డిపోలో బస్సు దిగిన ఆమె.. రెండో ప్లాట్‌ఫాం నుంచి బయటకు వెళుతుండగా తాళ్లూరు నుంచి వచ్చిన ఒంగోలు ఆర్టీసీ డిపో బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. వెనుక టైర్ కింద పడిన ఆమెకు కుడి కాలికి తీవ్ర గాయమైంది. 108లో రిమ్స్‌కు తరలించారు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనం ఢీ, ఇద్దరు మహిళలకు గాయాలు

అద్దంకి రూరల్: రోడ్డు దాడుతున్న ఇద్దరు మహిళలను ద్విచక్రవాహనం ఢీకొట్టటంతో గాయాలైన ఘటన శుక్రవారం రాత్రి అద్దంకి పట్టణంలో చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు... జేపంగులూరు మండలం చందలూరు గ్రామానికి చెందిన మహిళలు స్థానిక సిండికేట్ బ్యాంకు ఎదురుగా ఉన్న ప్రైవేటు వైద్యశాలకు వెళ్లి చూపించుకుని బయటకు వస్తున్నారు. అద్దంకి-నార్కెట్‌పల్లి నామ్ రహదారి దాటుతుండగా బైకు ఢీకొట్టింది. దీంతో ఇరువురు మహిళలకు గాయాలయ్యాయి. వారిలో గర్భిణి స్నహతప్పి పడిపోవటంతో 108 వాహనం ద్వారా అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పెనాల్టీలు పూర్తిగా రద్దు చేయాలి

● పొగాకు బోర్డు సభ్యుడు మారెడ్డి సుబ్బారెడ్డి



మారెడ్డి సుబ్బారెడ్డిని సన్మానిస్తున్న పొగాకు బోర్డు అధికారులు, బయ్యర్లు, పొగాకు రైతులు

మద్దిపాడు: పొగాకు బోర్డు కర్నాటకలో మాదిరి ఆంధ్రలో కూడా పెనాల్టీలు పూర్తిగా రద్దు చేయాలని భారత పొగాకు బోర్డు సభ్యుడు మారెడ్డి సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. కర్నాటకలో పొగాకు సాగు చేస్తున్న రైతులకు పొగాకు బోర్డు పెనాల్టీలు పూర్తిగా రద్దు చేసిందని అన్నారు. ఆంధ్రలో గతంలో పది శాతం పెనాల్టీ వసూలు చేసేవారని గత సంవత్సరం నుంచి ఐదు శాతం వసూలు చేస్తున్నారని తెలిపారు. భారత పొగాకు బోర్డు సభ్యునిగా మారెడ్డి సుబ్బారెడ్డి నియమితులై ఏడాది అయిన సందర్భంగా శుక్రవారం ఆయనకు వెల్లంపల్లి పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది, వివిధ కంపెనీల బయ్యర్లు శాలువాలు కప్పి బొకేలు ఇచ్చి సన్మానం చేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ వాతావరణ పరిస్థితుల అనుకూలతపై పంట దిగుబడి తగ్గడం కానీ, పెరగడం కానీ జరుగుతుందని, అందుకు రైతులను బాధ్యులను చేయడం తగదన్నారు. ఈ సంవత్సరం మేలిమి రకం పొగాకు ఎక్కువ శాతం పండిందని, రైతులకు మంచి ధర ఇచ్చి కొనుగోలు చేయాలని కంపెనీల ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ శ్రీధర్‌బాబుకు విషయం తెలియజేసి, త్వరలో ఎంపీలను కలుపుకుని కేంద్ర ప్రభుత్వానికి, వాణిజ్య శాఖ మంత్రికి మెమొరాండం సమర్పించనున్నట్లు ఆయన తెలిపారు.

పన్ను బకాయిలు చెల్లించాలి

● కమిషనర్ వెంకటేశ్వరరావు



ఇస్లాంపేటలో పర్యటిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: నగరంలోని ప్రజలు అన్ని రకాల పన్ను బకాయిలు సకాలంలో చెల్లించాలని కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు కోరారు. నగరంలోని 4వ డివిజన్ ఇస్లాంపేట ప్రాంతంలో నగరపాలక సంస్థ అధికారులతో కలిసి శుక్రవారం కమిషనర్ పర్యటించారు. ప్రతి ఇంటికి వెళ్లిన కమిషనర్.. బకాయిలున్న అన్ని రకాల పన్నులు చెల్లించాలని సూచించారు. అనంతరం ఇస్లాంపేట సచివాలయంలో సిబ్బందితో కమిషనర్ సమీక్షించారు. ఈ నెలాఖరుకల్లా అన్ని రకాల పన్ను బకాయిలు వసూలు చేయాలని ఆదేశించారు. ఇస్లాంపేట వార్డు సచివాలయం పరిధిలో మొత్తం 2030 అసైన్‌మెంట్లు ఇచ్చామని, వాటిలో 1033 అసైన్‌మెంట్లను పూర్తి చేశారని, మిగతావి కూడా పూర్తి చేయాలని ప్లానింగ్ సెక్రటరీని ఆదేశించారు. పీఎం-జేఏవై సర్వే పురోగతి గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి మంగళవారం కలెక్టర్ నిర్వహించే వీక్షణ సమావేశంలో పీఎం జేఏవై సర్వే పరోగతి గురించి ఆరా తీస్తున్నారన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వసూలు కాకుండా పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్ను, కొళాయి పన్ను గురించి ప్రత్యేకంగా సచివాలయ సిబ్బంది, నగరపాలక సంస్థ రెవెన్యూ సిబ్బందితో చర్చించారు. కార్యక్రమంలో 4వ డివిజన్ కార్పొరేటర్ షేక్ నూర్జహాన్ జాకీర్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ కే వెంకటేశ్వర్లు, ఎంఈ కే మాల్యాద్రి, శానిటరీ సూపర్‌వైజర్ ఎన్.పిచ్చయ్య, డీఈ రఘురాం, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మిరియం శ్రీనివాసులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జిల్లాలో పార్టీని ఎంతకు అమ్ముకున్నావ్..?

● జనసేన జిల్లా అధ్యక్షుడు రియాజ్‌పై రావూరి బుజ్జి ఆగ్రహం



మాట్లాడుతున్న మెగా బాలినేని అభిమాని రావూరి బుజ్జి

ఒంగోలు: జనసేన పార్టీని జిల్లాలో ఎంతకు ఎవరికి అమ్ముకున్నావో బహిరంగపరచాలంటూ మెగా బాలినేని అభిమాని రావూరి బుజ్జి జనసేన జిల్లా అధ్యక్షుడు రియాజ్‌పై మండిపడ్డారు. స్థానిక అంబేడ్కర్ భవన్ వద్ద ఉన్న మెగా బాలినేని కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చిరంజీవి ఫొటోను తాము నిర్వహించుకున్న క్రికెట్ పోటీలకు వాడుకోవడంపై రియాజ్ మాట్లాడటం అవివేకమని బుజ్జి అన్నారు. తాము మెగాస్టార్ చిరంజీవి అభిమానులమని, మరోవైపు బాలినేని అభిమానులమని, వారిద్దరి పేరుతో పోటీలు నిర్వహించామని, పోటీల బ్రోచర్‌ను సాక్షాత్తూ చిరంజీవి ఆవిష్కరించిన సంగతి తెలియదా అని ప్రశ్నించారు. జిల్లాలో మెగా ఫ్యామిలీని వాడుకుని లబ్ధిపొందుతోంది ఎవరో అందరికీ తెలుసన్నారు. టీడీపీ నాయకులతో కుమ్మక్కై లావాదేవీలు చూసుకోవడం తప్ప చిరంజీవి ఇమేజ్ పెంచేందుకు ఒక్క కార్యక్రమం ఏదైనా చేసి ఉంటే ప్రకటించాలని సవాల్ విసిరారు. ఒంగోలులో జనసేనను టీడీపీకి అమ్మేశారనే చర్చ నడుస్తోందన్నారు. చిల్లర మాటలు మాట్లాడితే తగిన బుద్ధి చెబుతామని బుజ్జి హెచ్చరించారు. నిన్నటివరకు గుప్తాను పక్కనే పెట్టుకుని తిరిగి నేడు గుప్తాకు జనసేనతో సంబంధం లేదనడం విలువలు లేని రాజకీయాలకు నిదర్శనమన్నారు. ఇంకోసారి బాలినేని శ్రీనివాసరెడ్డి, బాలినేని ప్రణీత్‌రెడ్డి గురించి ఇష్టం వచ్చినట్లు వ్యాఖ్యానిస్తే సహించేది లేదని, మెగా బాలినేని అభిమానులుగా తగిన గుణపాఠం చెబుతామని స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో ఇందుర్తి డుంబు, దాసరి పిచ్చయ్య, శంకర్, తోట శ్రీనివాస్, ముత్తు, సీహెచ్ నాగరాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో ఆరోగ్య సమస్యలు



బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శివపార్వతి

ఈతముక్కల (కొత్తపట్నం): బాల్య వివాహాలు చేయడం వలన ఆరోగ్యం బలహీనపడి వివిధ రకాల వ్యాధులు వస్తాయని ఈతముక్కల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ డి.శివపార్వతి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బేటీబచావో బేటీపడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శివపార్వతి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో చిన్న వయసులోనే వివాహాలు చేయడం చూస్తున్నామన్నారు. దానివలన జీవితంలో అనేక అనర్థాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాల గురించి వివరించారు. నిర్దిష్ట వయసు రాకముందే వివాహం చేస్తే ఆడపిల్లల్లో సరైన పరిణతి లేని కారణంగా శారీరకంగా, మానసికంగా, సామాజికంగా పలు సమస్యలు ఎదురవుతాయన్నారు. నిర్దేశిత లక్ష్యాన్ని ప్రతి ఆడపిల్ల కలిగి ఉండి భవిష్యత్తుకు పునాదులు నిర్మించుకోవాలని ఆకాంక్షించారు. బాలికలందరూ బాగా చదువుకుని మంచి అలవాట్లు నేర్చుకుని జీవితంలో స్థిరపడిన తర్వాతే వివాహం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శివయ్య, వైద్య సిబ్బంది మురళి పాల్గొన్నారు.

ఒంగోలు వచ్చిన కమిషనర్ రేబాల



స్వామివారికి పూజలు చేస్తున్న రేబాల శ్రీనివాసరావు, కుప్పం ప్రసాద్, తదితరులు

ఒంగోలు: సమాచార హక్కు చట్టం కమిషనర్ రేబాల శ్రీనివాసరావు శుక్రవారం ఒంగోలు వచ్చారు. ఒక ప్రైవేటు ఫంక్షన్‌కు హాజరైన ఆయన.. స్థానిక బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఆయన వెంట ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, శ్రీబాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ పాలకవర్గ ప్రతినిధులు ఆర్ఎస్ శ్రీనివాసరావు, బియ్యపు వరదరాజం, పబ్బిశెట్టి ద్వారకానాథ్, కూరపాటి సత్యన్నారాయణ, యిలింద్ర శ్రీను తదితరులు ఉన్నారు.

సాక్షి ఫ్యామిలీ
ఒంగోలు
శనివారం ॥ 4-3-2023



● కె. రామలక్ష్మి

తెలుగు సాహిత్యలోకం నుంచి రచయిత్రి కె.రామలక్ష్మి (92) వీడ్కోలు తీసుకున్నారు. రచయిత్రిగా, ఆరుద్ర సతీమణిగా, మద్రాసు (చెన్నై) నగరంలో తెలుగువారి ప్రతినిధిగా, నాటి సాహితీ సమూహాలలో కీలకమైన వ్యక్తిగా, సినిమా రంగంలో రచయిత్రిగా ఆమె సాగించిన యాత్ర సుదీర్ఘమైనది. ఆమె మరణంతో ఒక కాలపు తెలుగు సాహితీ చరిత్రకు మిగిలిన ఆఖరు సాక్షి లేకుండా పోయినట్టయ్యింది.

నివాళి

ఆమె ప్రతి అక్షరం స్త్రీ పక్షం

రచయిత్రి రామలక్ష్మి ఆరుద్ర కన్నుమూత

- అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నివాసంలో మృతి
- 100 కుపైగా పుస్తకాలు రాసిన రామలక్ష్మి
- జీవనజ్యోతి సినిమాకు ఉత్తమ కథా రచయితగా నంది అవార్డు
- జర్నలిస్టుగా, సెన్సార్ బోర్డు సభ్యురాలిగా సేవలు

ప్రముఖ రచయిత ఆరుద్ర సతీమణి కె.రామలక్ష్మి (92) కన్నుమూశారు. కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె.. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆస్మాన్‌ఘడ్‌లో ఉన్న నివాసంలో తుదిశ్వాస విడిచారు. రామలక్ష్మి ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జిల్లా కోటనందూర్‌లో 1930 డిసెంబర్ 31న జన్మించారు. మద్రాస్ విశ్వవిద్యాలయంలో బీఏ పూర్తిచేశారు. ఆంగ్ల, ఆంధ్ర సాహిత్యం, ప్రాచీనాంధ్ర సాహిత్యం అభ్యసించారు. 1954లో ప్రముఖ కవి ఆరుద్రను వివాహం చేసుకున్నారు. వీరికి ఐదుగురు కుమార్తెలు. 1951 నుంచే రామలక్ష్మి రచనా ప్రస్థానం మొదలైంది. వివాహమైన తర్వాత 'రామలక్ష్మి ఆరుద్ర' కలం పేరుతో రచనలు చేశారు. మొత్తం 100 కు పైగా పుస్తకాలు రాశారు. ఆంధ్రపత్రికలో ఆమె సుదీర్ఘకాలం నిర్వహించిన 'ప్రశ్న జవాబు' శీర్షిక ప్రసిద్ధి చెందింది. విడదీసే రైలుబళ్లు, అవతలిగట్టు, మెరుపుతీగె, తొణికిన స్వర్గం, మానని గాయం, ఆణిముత్యం, పెళ్లి, ప్రేమించు ప్రేమకై, ఆడది, ఆశకు సంకెళ్లు, కరుణ కథ, లవంగి, ఆంధ్ర నాయకుడు, పాండురంగని ప్రతిజ్ఞ, నీదే నా హృదయం, అద్దం, ఒక జీవికి స్వేచ్ఛ వంటి కథా సంకలనాలను రామలక్ష్మి రచించారు. తెలుగు సాహిత్య రంగానికి చేసిన సేవలకు గాను ఆమెకు గృహలక్ష్మి, స్వర్ణకంకణం సహా పలు ప్రతిష్ఠాత్మక పురస్కారాలు దక్కాయి.

ఉత్తమ రచయిత్రిగా నంది అవార్డు...

రామలక్ష్మి పలు సినిమాలకు కథలు అందించారు. 1975వ సంవత్సరంలో జీవనజ్యోతి సినిమా కథకు గాను అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి నంది అవార్డు అందుకున్నారు. కాసా సుబ్బారావు నిర్వహించిన స్వతంత్ర దినపత్రికలో జర్నలిస్టుగా పని చేశారు. 1978లో ఉత్తమ జర్నలిస్టుగా రామానాయుడు అవార్డు అందుకున్నారు. పలు స్త్రీ సంక్షేమ సంఘాల్లో సేవలు అందించి మహిళల శ్రేయస్సు కోసం పాటుపడ్డారు. కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డ్ రీజనల్ ప్యానెల్ సభ్యురాలిగా కూడా పనిచేశారు. రామలక్ష్మి ఆరుద్ర మృతిపట్ల పలువురు రచయితలు, సినీ, రాజకీయ, ఇతర రంగాల ప్రముఖులు సంతాపం తెలిపారు. శుక్రవారం సాయంత్రమే ఎస్ఆర్‌నగర్ శ్మశానవాటికలో ఆమె అంత్యక్రియలను నిర్వహించారు.

స్టెల్లా మేరీ స్టూడెంట్

స్వస్థలం కాకినాడ అయినా కె.రామలక్ష్మి చదువు చెన్నైలోనే సాగింది. స్టెల్లా మేరీ కాలేజీలో చదువుకుని ఇంగ్లిష్ భాషలో పట్టు సాధించారు. 'ఐ యామ్ ఏ స్టెల్లామేరియన్' అని గర్వంగా చెప్పుకునేవారు. కాలేజీలో ఒక కార్యక్రమానికి అతిథిగా హాజరైన ప్రఖ్యాత జర్నలిస్టు ఖాసా సుబ్బారావు ఇంగ్లిష్‌లో ఉపన్యాసం ఇచ్చిన కె.రామలక్ష్మిని చూసి పరీక్షలు అయిపోయాక తనని కలవమని చెప్పారు. 'స్వతంత్ర' పత్రికలో ఇంగ్లిష్ విభాగంలో పాత్రికేయురాలిగా ఉద్యోగం ఇచ్చారు. 'తెలుగు స్వతంత్ర'కు ఎడిటర్‌గా ఉన్న ఖాసా సుబ్బారావు కోరిక మేరకు 'నడుస్తున్న చరిత్ర' కాలమ్ రాశారు రామలక్ష్మి. ఆమె ఇంటిలో ప్రతి సాయంత్రం సాహితీచర్చలు జరిగేవి. వాటికి ఆరుద్ర, శ్రీరంగం నారాయణబాబు, శ్రీశ్రీ తదితరులు హాజరయ్యేవారు. ఆరుద్ర, రామలక్ష్మి పరస్పరం ఇష్టపడి ఆ రోజుల్లో అంటే 1954ఏప్రిల్30న రిజిస్టర్డ్ మేరేజ్ చేసుకున్నారు. ఈ పెళ్లికి దర్శకుడు హెచ్.ఎం.రెడ్డి, శ్రీశ్రీ సాక్షి సంతకాలు చేశారు. శ్రీశ్రీ తన పెళ్లికి సాక్షి సంతకం చేయాలని ఆరుద్ర భావించడం వల్ల ఇది జరిగింది. శ్రీశ్రీ రామలక్ష్మిని 'అత్తగారు' అని సరదాగా పిలిచేవారు. అయితే శ్రీశ్రీ ధోరణిని రామలక్ష్మి చివరి వరకూ వ్యతిరేకిస్తూనే వచ్చారు.



● కుమార్తెలు విజయ, త్రివేణి, కవిత, లలిత, వాసంతిలతో ఆరుద్ర, రామలక్ష్మి

ఆరుద్రకు అండా దండా

ఆరుద్ర సినిమా రంగంలో కృషి చేయడానికి, 'సమగ్రాంధ్ర చరిత్ర' పరిశోధన పూర్తి చేయడానికి రామలక్ష్మి అందించిన అండదండలే కారణం. వీరికి ఐదుగురు కుమార్తెలు విజయ, త్రివేణి, కవిత, లలిత, వాసంతి. వీరి పెంపకం, చదువు బాధ్యతలకోసం ఆరుద్ర సమయాన్ని తీసుకోకుండా ఆమే తన సమయమంతా వెచ్చించారు. 'ఆరుద్ర సమగ్రాంధ్ర సాహిత్యం కోసం విపరీతంగా సమయం ఇవ్వాలనుకునేవాడు. కాని ఇల్లు గడవాలి కదా. సినిమా రంగంలో పని చేస్తేనే డబ్బులు వస్తాయి. అందుకని నేనేమి అనకుండా గబగబా కొన్ని పాటలు రాసేసి ఆ డబ్బు అప్పజెప్పి మళ్లీ పరిశోధనలో పడేవాడు' అన్నారు రామలక్ష్మి. ఆరుద్రకు అనారోగ్యం వస్తే నాటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్ రెడ్డితో మాట్లాడి ప్రభుత్వ సహాయం అందేలా చూశారామె. 'నేను మరణించినప్పుడు ఎటువంటి హంగామా చేయవద్దు' అని ఆరుద్ర కోరడం వల్ల 1998లో ఆరుద్ర మరణించినప్పుడు కేవలం ముగ్గురు నలుగురు స్నేహితులతో కలిసి అంత్యక్రియలు నిర్వహించి ఆ తర్వాతే మరణవార్తను లోకానికి తెలియచేశారు. ఇది సాహిత్య ప్రియులను బాధించినా రామలక్ష్మి ధోరణి అలాగే ఉండేది.

సినిమా రచయిత్రి


కె.రామలక్ష్మికి సినిమా రంగంలో అందరూ సుపరిచితులు స్నేహితులు. వారిలో భానుమతి రామకృష్ణ, జయలలిత, వాణిశ్రీ తదితరులు ఉన్నారు. కె.విశ్వనాథ్ తీసిన 'జీవనజ్యోతి' సినిమాకు రామలక్ష్మి కథను అందించారు. ఈ సినిమా నిజానికి వాణిశ్రీ కోసమే రాశారు. కె.రామలక్ష్మి రాశారని వాణిశ్రీ నటించారు. దీని నిర్మాణ సమయంలో విశ్వనాథ్‌కు, రామలక్ష్మికి వాదోపవాదాలు నడిచాయి. దాంతో కె.విశ్వనాథ్ విజయవాడలో జరిగిన శతదినోత్సవంలో 'ఇకపై ఇతరులు రాసిన కథలతో నేను సినిమాలు తీయను' అని ప్రకటించారు. రామలక్ష్మి రాసిన మరో సినిమా 'గోరింటాకు'. అయితే దీని మీద ఆ రోజుల్లో వివాదం చెలరేగింది. దాసరి నారాయణరావు స్టోరీ డిపార్ట్‌మెంట్‌లో తెర వెనుక ఉండి పని చేసిన వారిలో రామలక్ష్మి కూడా ఒకరు. ఆమె 1970లలో సెన్సార్ బోర్డ్ మెంబర్‌గా పని చేశారు.

స్త్రీ పక్షపాతి

రామలక్ష్మి నిత్య జీవితంలోనే కాదు రచనా జీవితంలోనూ ఆధునికురాలు. ఛాందసాలు లేని జీవనం గడపాలని, భార్యాభర్తలు స్నేహమయ జీవనాన్ని అనుభవించాలని, స్త్రీలకు తమ జీవిత భాగస్వామిని ఎంచుకునే స్వేచ్ఛ ఉండాలని ఆ రోజుల్లోనే తన కథలలో చెప్పారామె. 1954లో ఆమె తన తొలి కథా సంపుటి 'విడదీసే రైలుబళ్లు' వెలువరించారు. ఈ సంపుటిలోని 'చీలిన దారులు' అనే కథలో ఒక జంట పెళ్లి చేసుకోకుండా సహజీవనం ప్రారంభిస్తారు. పెళ్లి ప్రేమను చంపేస్తుంది అని ఆ కథలో రాసి అప్పటికి తెలియని సహజీవనాన్ని ప్రతిపాదించారామె. 'తొణికిన స్వప్నం', 'ఒక జీవికి స్వేచ్ఛ', 'అద్దం' తదితరాలు ఆమె ఇతర కథా సంపుటాలు. భార్యాభర్తలు స్నేహితులుగా ఉండాలని సూచిస్తూ 1970లలో ఆమె రాసిన 'పార్వతి కృష్ణమూర్తి కథలు' పాఠకాదరణ పొందాయి. ఇందులో భార్య అరమరికలు లేకుండా భర్తతో తన అభిప్రాయాలను చెబుతుంది. స్నేహాన్ని, గౌరవను ప్రదర్శిస్తుంది. భార్యంటే భర్త చెప్పినట్టుగా పడుండాలనే నాటి ధోరణికి ఈ పాత్ర పూర్తి భిన్నం. రామలక్ష్మి రాసిన కథల్లో 'అదెక్కడ' విశిష్టమైనది. ఆ కథలో ముఖ్య పాత్ర తన పేరు మర్చిపోతుంది. దాని కారణం భర్త, పిల్లలు అందరూ 'అది' అని పిలుస్తూ ఉండటమే. చివరకు ఆమె ఒకరోజు ఇంట్లో నుంచి వెళ్లిపోతుంది. భర్త 'అదెక్కడ' అని ఎందరిని అడిగినా కనిపించదు. పురుషుడు మోసం చేస్తే స్త్రీ సింగిల్ మదర్‌గా జీవించగలదనే సందేశం ఇస్తూ కథలు రాశారు. బేలగా ఉండే స్త్రీలను అలాంటి పాత్రలను రామలక్ష్మి హర్షించలేదు. స్త్రీలు ఆత్మవిశ్వాసంతో ధైర్యంగా తమ జీవితాన్ని మలుచుకోవాలని కోరుతారు.

ఆమె రచనలను ఈ తరానికి మళ్లీ చేరువ చేయాల్సి ఉంది.

కళ





● విజేత కుమార్

ఫుట్‌బాల్ చెప్పిన కథ

మార్పు అనేది సామాజిక ఉద్యమాలతోనే కాదు...సరదాగా మొదలయ్యే ఆటలతో కూడా సాధ్యపడుతుందని నిరూపించింది రాజస్థాన్‌కు చెందిన మహిళా జన్ అధికార్ సమితి. ఫుట్‌బాల్ ఆటతో అమ్మాయిల ఆలోచన ధోరణిలో వచ్చిన మార్పు, చైతన్యాన్ని ప్రపంచానికి పరిచయం చేసింది కికింగ్ బాల్స్...

రాజస్థాన్‌లో అనేక ప్రాంతాల్లో బాల్యవివాహాలు సర్వసాధారణం. దీన్ని దృష్టిలో పెట్టుకొని బాల్యవివాహాలకు అడ్డకట్టవేయడానికి మహిళా జన్ అధికార్ సమితి అమ్మాయిల కోసం ఊళ్లలో 'ఫుట్‌బాల్ క్లబ్'లను ఏర్పాటు చేసింది.

బాల్యవివాహాల నిరోధానికి, ఫుట్‌బాల్ ఆటకు సంబంధం ఏమిటి? అనే సందేహం సహజంగానే వస్తుంది. అయితే ఆ ఫుట్‌బాల్ క్లబ్‌లు ఆట మెలకువలకు మాత్రమే పరిమితం కాకుండా పరివర్తన కేంద్రాలుగా మారడమే కొసమెరుపు.

ఆట ఆడటం కోసం సాయంత్రం ఎంతో మంది అమ్మాయిలు గ్రౌండ్‌కు వస్తారు. ఆట పుణ్యమా అని వారి మధ్య స్నేహం పెరిగింది. ఆట అయిపోయిన తరువాత రకరకాల కబుర్లు చెప్పుకునేవారు. అన్ని విషయాలతో పాటు బాల్యవివాహాల టాపిక్ కూడా వచ్చేది.

అంతమాత్రాన పెద్దలను వ్యతిరేకించగలరా? తరాల సంప్రదాయాన్ని కాదనగలరా?

'అవును....అనగలరు' అని ఎందరో అమ్మాయిలు నిరూపించారు. 'చదువు తరువాతే పెళ్లి' అని తల్లిదండ్రులతో గట్టిగా చెప్పారు.

కట్ చేస్తే...

ముంబైలో ఉంటున్న విజేత కుమార్ బ్రాండెడ్ కంటెంట్, మ్యూజిక్ వీడియోలు రూపొందించడంలో మంచి పేరు తెచ్చుకుంది. తన తొలి షార్ట్ ఫిల్మ్ 'బ్లాజ్' న్యూయార్క్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'బెస్ట్ షార్ట్ ఫిల్మ్' అవార్డ్ అందుకుంది.

కొంత కాలం క్రితం విజేత తన స్వస్థలం రాజస్థాన్‌లోని అజ్మీర్‌కు వెళ్లింది. ఒక సాయంత్రం పూట బాల్య జ్ఞాపకాలను పలకరించడానికి తాను చదువుకున్న స్కూలుకు వెళ్లింది. అక్కడ ఆడపిల్లలు చాలా సీరియస్‌గా ఫుట్‌బాల్ ఆడుతుంటే అబ్బురపడింది.

ఆసక్తిగా ఆ అమ్మాయిలను పలకరించింది విజేత.

'స్కూల్ పూర్తయిన తరువాత ఇంటికి వెళితే ఇక బయట అడుగుపెట్టడం అంటూ ఉండేది కాదు. అలాంటిది ఫుట్‌బాల్ ఆట వల్ల రోజూ సాయంత్రం గ్రౌండ్‌కు రాగలుగుతున్నాను' అని తనకు లభించిన స్వేచ్ఛ గురించి చెప్పింది ఒక అమ్మాయి.

ఫుట్‌బాల్ ఆట వల్ల తమలో పెరిగిన ఆత్మవిశ్వాసం, నలుగురితో కలిస్తే వచ్చే ధైర్యం, బాల్యవివాహాలపై వ్యతిరేకత గురించి మరో అమ్మాయి వివరంగా చెప్పింది. ఇలా అందరూ తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

> 'వావ్' అనుకోవడమే కాదు డాక్యుమెంటరీ తీయాలని కూడా అనుకుంది విజేత. అనేకానేక సందేహాలతో తొలుత వారు కెమెరా ముందుకు రావడానికి నిరాకరించారు. అయితే విజేతకు వారితో స్నేహం పెరిగాక, తన మీద నమ్మకం ఏర్పడిన తరువాత 'కికింగ్ బాల్స్' పేరుతో డాక్యుమెంటరీ రూపుదిద్దుకుంది.

'వావ్' అనుకోవడమే కాదు డాక్యుమెంటరీ తీయాలని కూడా అనుకుంది విజేత. అనేకానేక సందేహాలతో తొలుత వారు కెమెరా ముందుకు రావడానికి నిరాకరించారు. అయితే విజేతకు వారితో స్నేహం పెరిగాక, తన మీద నమ్మకం ఏర్పడిన తరువాత 'కికింగ్ బాల్స్' పేరుతో డాక్యుమెంటరీ రూపుదిద్దుకుంది.

పిల్లలతో కలిసి ఈ డాక్యుమెంటరీని చూసింది విజేత. 'కికింగ్ బాల్స్' పిల్లలకు నచ్చింది. ఆ తరువాత ప్రపంచ ప్రేక్షకులకు కూడా నచ్చింది.

బ్యూటిప్స్

ఏమి చేయకూడదంటే...

అందానికి చిట్కాలు పాటించడానికి ముందు ఏమేం చేయకూడదో తెలుసుకుంటే మంచిదేమో! ఇవన్నీ తెలిసినవే, అయినా ముఖ్యంగా నిర్లక్ష్యం చేసేదిక్కడే.



● మొటిమలను గిల్లితే, మచ్చలు పడతాయి. వీటిని పోగొట్టుకోవడానికి చాలా కష్టపడాలి. గిల్లినప్పుడు మొటిమల నుండి వెలువడిన స్రావం ముఖం మీద ఎక్కడ తగిలితే అక్కడ కూడా మొటిమలు వస్తాయి. ● ఫంక్షన్‌కు వెళ్లే ముందు మేకప్ వేసుకుంటాం, కానీ తిరిగి వచ్చాక తుడిచేయడానికి బద్ధకించి అలాగే నిద్ర పోతాం. కొబ్బరినూనెతో తుడుచుకునేంత ఓపిక లేకపోతే కనీసం గోరువెచ్చని నీటిలో కాటన్ ముంచి అయినా మేకప్ క్లీన్ చేయాలి. ● మేకప్ సామగ్రిని ప్రతి ఆరునెలలకొకసారి అప్‌డేట్ చేసుకోవాలి. ఎక్స్‌పైరీ డేట్ చెక్ చేసుకుని, వాటిని కిట్ నుండి తొలగించాలి. ● మేకప్‌లో ఫౌండేషన్ ఇంపార్టెంట్. దీన్ని జాగ్రత్తగా వేసుకోవాలి. స్కిన్ కలర్‌కు సూటయ్యే షేడ్ వాడాలి. అవసరమైన మేరకే వాడాలి. ● హెయిర్ కండిషనర్ వాడేటప్పుడు చిన్న జాగ్రత్త కావాలి. జుట్టు కుదుళ్లకు తగలకుండా అప్లై చేయాలి. జుట్టు పొడిబారినప్పుడు మాత్రమే కండిషనర్ వాడాలి.

ఇంటిప్స్

సహజమైన రూమ్ ఫ్రెష్‌నర్

● అరకప్పు టేబుల్ సాల్ట్ తీసుకుని, అందులో గులాబీ రేకులను వేయాలి. వీటితోపాటు ఒక స్పూన్ లవెండర్ ఆయిల్ లేదా ఆల్మండ్ ఆయిల్ వేయాలి. అంతే! గది సువాసనలతో నిండిపోతుంది.
● దీన్ని మరింత సులువుగా చేయాలంటే వొలిచిన నారింజ లేదా కమలా పండు మీద టేబుల్ స్పూన్ సాల్ట్‌ను చల్లి ఒక మూలన పెడితే సరి!
● సింక్ మెరవడానికి: ఖరీదైన క్లెన్సర్ జోలికి పోకుండా సింక్ పరిశుభ్రంగా... కొత్త దానిలా కనిపించాలంటే... నిమ్మరసంలో కొద్దిగా టేబుల్ సాల్ట్ వేసి సింక్‌ను తుడిస్తే చాలు... చూస్తుండగానే సింక్ కొత్తదానిలా మెరుస్తుంది.



● పచ్చదనాల పొదరిల్లు

మొక్కలో మొక్కనై!

**మందారాలు 16 రంగులున్నాయి.
జామ చెట్లు ఏడురకాలున్నాయి.
అరటి పండ్ల చెట్లు ఐదు రకాలు.
వేప, సీమచింత, కానుగ...
మర్రి, రావి, జువ్వి, కొబ్బరి...
కుండీల్లో ఒదిగిపోయాయి.
రణపాల, కొండపిండి...
ఇన్సులిన్ ప్లాంట్, కప్పరిల్ల...
ఔషధమొక్కల లిస్ట్ ఇది.
ఇవన్నీ ఉన్నది నర్సరీలో కాదు.
మొక్కల్ని పిల్లల్లా పెంచే మంజుల ఇంట్లో.
మనం తినే పంటలు పండించుకుంటున్నాం.
పీల్చే గాలిని కూడా 'పెంచుకుందాం' అంటోందామె.**

''ఆమెకు గ్రీన్ ఇండియా చాలెంజ్ విసిరిన వాళ్లు లేరు. తనకు తానుగా తీసుకున్న చాలెంజ్ కూడా కాదు. ఆమె మనసు కోరుకున్న ముచ్చట. పచ్చదనంతో ఆమె పాతికేళ్ల ప్రస్థానానికి ప్రతిరూపం ఈ ఇల్లు. ఆంధ్రప్రదేశ్, నెల్లూరు జిల్లా, గంగపట్నం గ్రామంలో 65 అంకణాల స్థలంలో ఉన్న ఈ ఇంటి పేరు 'జీఆర్‌కే గార్డెన్'. గేటు ముందు నిలబడి చూస్తే ఇల్లు కనిపించదు. అల్లిబిల్లిగా అల్లుకున్నట్లున్న చెట్లు, తీగలను తొలగించి చూస్తే తప్ప గోడలు కనిపించవు. ఎన్ని మొక్కలున్నాయి? ఎన్ని రకాలున్నాయి? అని లెక్కపెట్టాలంటే సాధ్యమయ్యేటట్లు కనిపించలేదు. ఆ వివరాలన్నీ ఈ మొక్కల తల్లి మంజుల చెప్పాల్సిందే.

సేకరణ చిన్న పని కాదు!

''నేను ఐసీడీఎస్‌లో ఇన్‌చార్జ్ సూపర్‌వైజర్‌ని. ఉద్యోగంలో పిల్లల్ని చూసుకోవడం, ఇంట్లో మొక్కల్ని పెంచుకోవడమే నా లైఫ్. పండ్ల మొక్కలు దేశీవిదేశీ అన్నీ కలిపి వందకు పైగా ఉన్నాయి. తీగజాతితో కలిపి పూల మొక్కలు వందల్లో ఉన్నాయి. బాటిల్స్, కుండీలు, డ్రమ్ములు మూడు వేలకు పైగా ఉన్నాయి. నా దగ్గర పేపర్ వైన్ మొక్క కూడా ఉంది. యూ ట్యూబ్‌లో మ్యాడ్ గార్డెనర్ మాధవి గారి గార్డెన్ నుంచి తీగజాతులు తెప్పించుకున్నాను. హైదరాబాద్ నర్సరీ మేళాల నుంచి సేకరించాను. బెంగళూరు నుంచి కూడా తెచ్చుకున్నాను. మొక్కలు ఎన్ని కొంటున్నానో లెక్క చూసుకోకుండా కొనేస్తాను. కానీ బస్సు వాళ్లను రిక్వెస్ట్ చేసి వాటిని ఇంటికి తెచ్చుకోవడం చాలా కష్టమయ్యేది. స్వయంగా వెళ్లడం కుదరని నర్సరీలకు ఫోన్ చేసి వీడియో కాల్‌లో అక్కడ ఉన్న మొక్కలను చూసి నా దగ్గర లేనివేవో చెప్పి తెప్పించుకుంటున్నాను. యాలకులు, మిరియాలు, దాల్చిన చెక్క, జాపత్రి వంటి సుగంధ ద్రవ్యాల మొక్కలన్నీ ఉన్నాయి, కానీ లవంగాల తీగ మాత్రం దొరకలేదు.

> **ఎనిమిదిళ్లు మారాను!**
>
> మొక్కల కోసం మార్కెట్‌లో దొరికే కుండీలు చాలవని పెద్ద పెద్ద సిమెంట్ కుండీలు కూడా నేనే స్వయంగా చేసుకున్నాను. ఇల్లు మారిన ప్రతిసారీ ఈ కుండీలను తీసుకెళ్లడం ఎంత కష్టమయ్యేదో. అలా ఎనిమిదిళ్లు తిప్పాను. నా కష్టం చూసి మా నాన్న ఈ ఇల్లు అమ్మకానికి వచ్చిన సంగతి తెలిసి వెంటనే కొన్నారు. అప్పుడు కూడా 'నీకు ఇల్లు' అని చెప్పలేదు. 'నువ్వు మొక్కలు పెంచుకోవడానికి ఇల్లు' అని చెప్పారు. నాన్న గుర్తుగా నాటిన మామిడి చెట్టు చూడండి ఎంత ఎదిగిందో చూడండి.
>
> – గుడి మంజుల, మొక్కల ప్రేమికురాలు



సీతాఫల కుటుంబం

సీతాఫలం మనకు బాగా తెలుసు. నా దగ్గర రామాఫలం, లక్ష్మణఫలం, హనుమఫలం కూడా ఉన్నాయి. కుండీల్లో కాసే పనస నుంచి యాపిల్ మూడు రకాలు, కివీ, అవొకాడో కూడా పెంచుతున్నాను. ఓ సారి ఎవరితోనో మాట్లాడుతూ 'మా పాప కంటే ముందు మొక్కలనే చూసుకుంటాన'ని చెప్పాను. ఆ మాటను గుర్తు చేసి మరీ దెప్పుతుంటుంది మా అమ్మాయి. తానిప్పుడు హైదరాబాద్‌లో చదువుకుంటోంది. మా వారు కృష్ణపట్నం పోర్టులో ట్రాన్స్‌పోర్ట్ సూపర్‌వైజర్. ఆయనకు ఇంటి నిండా మొక్కలున్నాయని మాత్రమే తెలుసు. మొక్కల పేర్లు కూడా తెలియదు. ఆయన మొక్కల సరదా అంతా సెల్ఫీలు తీసుకుని వాట్సాప్ డీపీలు పెట్టుకోవడం వరకే. మొక్కల పని అంతా నేను, మా అమ్మ చూసుకుంటాం. ఉదయం రెండు గంటల సేపు నేను టెర్రస్ మీద పని చేస్తాను. నేను, మా వారు డ్యూటీలకు వెళ్లిన తర్వాత మా అమ్మ మూడు గంటల సేపు కింద ఉన్న మొక్కల పని చూసుకుంటుంది. సాయంత్రం వచ్చిన తర్వాత కూడా నాకు గంట– రెండు గంటల సేపు ఎరువు కలపడం వంటి ఏదో ఒక పని ఉంటుంది.

చెట్లమ్మ

మా ఇంటి ఇరుగుపొరుగు వాళ్లు 'టెర్రస్ మీద ఇంత బరువు పెడుతున్నావు. ఇల్లు జాగ్రత్త' అంటూ ఉంటారు. ఇల్లు పాడయితే మరో చిన్న ఇల్లు కట్టుకుంటాను. మొక్కలు పోతే మళ్లీ మొక్కలు పెరగాలంటే ఎన్నో ఏళ్లు పడుతుందని చెబుతాను. నీ చుట్టుపక్కల ఉండడం మాకూ మేలే. మేము పెంచకపోయినా నువ్వు పెంచిన మొక్కల గాలిని పీల్చుకుంటున్నాం అని నవ్వుతారు. మా చెల్లి కొడుకైతే నన్ను చెట్లమ్మ అనే పిలుస్తాడు. ప్రతి ఇల్లూ మొక్కల్ని పెంచితే గాలి ఎందుకు కలుషితమవుతుంది? దారికి అడ్డు వస్తోందని, మరేదో పనులకు ఇబ్బందవుతోందని... ఎన్నో ఏళ్లు పెరిగిన చెట్టుని నిలువునా నరికేస్తుంటారు. పెరిగిన చెట్టుని నరకడం కాదు, ఒక చెట్టుని పెంచి చూడండి అని గొంతెత్తి అరవాలనిపిస్తుంటుంది'' అని మొక్కల మీద తన ప్రేమను వ్యక్తం చేశారు గుడి మంజుల.

– వాకా మంజులారెడ్డి